ఈనాడు
బాపట్ల
మంగళవారం సెప్టెంబరు 1, 2026

సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం చేయూత అందిస్తోంది. వేట పడవలు సురక్షితంగా నిలుపుకోవడానికి నిజాంపట్నం మండలం గొంది సముద్రం, బాపట్ల మండలం అడవిపల్లెపాలెంలో రూ.2.64 కోట్లతో రెండు జెట్టీలు నిర్మిస్తోంది. వీటి నిర్మాణం పూర్తయితే సంద్రంలోకి మరపడవలు సులువుగా రాకపోకలు సాగించే వీలుంటుంది. చేపల వేట సులభమై మత్స్యకారుల ఆదాయం పెరుగుతుంది.

తీరంలో మరో రెండు జెట్టీలు

బాపట్ల, న్యూస్‌టుడే

రూ.2.64 కోట్లతో నిర్మాణం

జిల్లాలో 2,883 వేట పడవలు ఉండగా నిజాంపట్నం హార్బర్‌లో మాత్రమే జెట్టీ ఉంది. సూర్యలంక, వాడరేవు, అడవులదీవి, రామచంద్రాపురం, కృపానగర్, రామాపురం, కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం వద్ద సముద్రంలో, తీరం ఒడ్డున, సమీపంలోని కాలువల్లో లంగరు వేసి పడవలు ఉంచుతున్నారు. తుపానులు, వాయుగుండాల సమయంలో అలల ఉద్ధృతికి పడవలు దెబ్బతిని మత్స్యకారులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. ఒడ్డున నిలిపిన బోట్లు కొట్టుకుపోయిన సందర్భాలు కూడా లేకపోలేదు.

నిజాంపట్నం హార్బర్ విస్తరణ పనులు సుమారు 82 శాతం జరిగాయి. అక్కడ నిర్మించిన జెట్టీలో 250 పడవల వరకు నిలపడానికి అవకాశం ఉంది. చీరాల మండలం వాడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం డీపీఆర్ దశలో ఉంది. ఇది కార్యరూపం దాల్చితే మత్స్యకారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో జెట్టీలు నిర్మించాలన్న ప్రతిపాదనలు దశాబ్దాల నుంచి ఉన్నాయి.

అడవిపల్లెపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న జెట్టీ

పనుల్లో జాప్యం

బాపట్ల, చీరాల మండలాల సరిహద్దుల్లో ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ కాలువలో 500 వేట పడవల్ని నిలుపుతున్నారు. ఇక్కడ జెట్టీ నిర్మించాలన్న ప్రతిపాదన 18 ఏళ్లుగా ఉంది. జెట్టీ నిర్మాణ పనులను రూ.1.32 కోట్ల అంచనాతో మార్చి 12న గుత్తేదారు సంస్థకు అప్పగించారు. పనులు పూర్తి చేయడానికి ఆరు నెలల గడువు ఇచ్చారు. సెప్టెంబరు 11 నాటికి పూర్తి చేయాల్సి ఉన్నా పనుల్లో జాప్యం చోటు చేసుకుంది. ఇప్పటివరకు రూ.47 లక్షల విలువైన పనులే (35 శాతం) పూర్తి చేశారు. బీమ్‌లు, డెక్ శ్లాబ్ పనులు ఇంకా ప్రారంభించలేదు. జెట్టీ నిర్మాణం పూర్తి చేయడానికి మరో ఆరు నెలలు పట్టేలా ఉంది. ఆ మేరకు ఒప్పంద గడువు పొడిగించనున్నారు.

➾ నిజాంపట్నం మండలం కొత్తపాలెం పరిసర గ్రామాల నుంచి 300 పడవలు సముద్రంలో వేట సాగిస్తాయి. వీటిని నిలపడానికి గొందిసముద్రం వద్ద రూ.1.32 కోట్లలో జెట్టీ నిర్మిస్తున్నారు. గతేడాది అక్టోబరు 9న గుత్తేదారు సంస్థకు పనులు అప్పగించారు. ఈ ఏడాది మే 20 నాటికి నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.89 లక్షల విలువైన(67 శాతం) పనులు జరిగాయి. జెట్టీ నిర్మాణం పూర్తి చేయడానికి ఒప్పంద గడువును మరో ఆరు నెలలు పొడిగించారు. మత్స్యశాఖ డీడీ గాలిదేవుడు మాట్లాడుతూ రెండు జెట్టీల నిర్మాణ పనులు వేగవంతం చేస్తామన్నారు. త్వరలో పూర్తి చేసి మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

కల సాకారమవుతోంది: కలెక్టర్

రెడ్‌క్రాస్ సేవలకు పురస్కారాలు

బాపట్ల, న్యూస్‌టుడే: రెడ్‌క్రాస్ ద్వారా ఉత్తమ సేవలు అందించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా మూడు పసిడి పతకాలు అందుకోనుండటం చాలా సంతోషంగా ఉందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు గవర్నర్ నుంచి కలెక్టర్ అవార్డులు తీసుకోవడం చూశానన్నారు. భవిష్యత్తులో తానూ కలెక్టర్‌నై అలా పురస్కారం అందుకోవాలని కలలు కన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ కల సాకారమవుతోందన్నారు. రెడ్‌క్రాస్ అత్యధిక సభ్యత్వాలు, జిల్లా ఫ్లాగ్ డే నిధికి అత్యధిక విరాళాలు సేకరించడం, తిరుపతిలోని ఎస్‌వీఆర్ఆర్ ఆసుపత్రికి సంబంధించిన అన్ని రకాల దస్త్రాలను సకాలంలో పూర్తి చేసినందుకు మూడు విభాగాల్లో బంగారు పతకాలకు ఎంపికైనట్లు వివరించారు. ఇది కేవలం తన ఒక్కడితో సాధ్యం కాలేదని, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితోనే మూడు పురస్కారాలు వచ్చాయని తెలిపారు.

మూలకు యంత్రాలు.. ఇంట్లోకి దోమలు!

చీకటి పడితే చాలు దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్నాయి. ఫలితంగా నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పేడ దిబ్బలు, చెత్తకుప్పలు నివాస ప్రాంతాల పక్కనే ఉండటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. మురుగుకాలువల్ని తరచూ శుభ్రం చేయక దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. వీటి నివారణకు ఆయిల్ బాల్స్ వేయడంలేదు. ఎక్కడైనా, ఎవరికైనా విషజ్వరాలు, మలేరియా, డెంగీ సోకితే అధికారులు హడావుడిగా మందులు స్ప్రే చేస్తున్నారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయడానికి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

చీరాల అర్బన్, బాపట్ల టౌన్, మార్టూరు, నగరం, న్యూస్‌టుడే

పంచాయతీలకు వచ్చే ఆదాయంలో 15 శాతం పారిశుద్ధ్య పనులకు వ్యయం చేయాల్సి ఉంది. దస్త్రాల్లో మాత్రం పూర్తిగా ఖర్చు చేసినట్లు చూపి క్షేత్రస్థాయిలో నామమాత్రంగా పనులు చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఫాగింగ్ కోసం కొనుగోలు చేసిన యంత్రాలు స్టోర్ రూముల్లో మూలుగుతున్నాయి. కొన్నిచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. సంబంధిత అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

జిల్లెళ్లమూడి: స్టోర్ రూంలో ఫాగింగ్ యంత్రం

చీరాల.. నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో 24 పంచాయతీలున్నాయి. పందిళ్లపల్లి, వేటపాలెం, కొత్తపేట, దేశాయిపేట, రామకృష్ణాపురం, జాండ్రపేట, ఈపూరుపాలెం మేజర్ పంచాయతీలు. వీటి పరిధిలో దాదాపు 90 వేల జనాభా ఉంది. కొన్ని పంచాయతీల్లోని మురుగు కాలువల్లో దోమల నివారణకు బాల్స్, మందులు వినియోగించడంలేదు. ఎన్నికలు లేకపోవడంతో నిధులు లేవని కార్యదర్శులు చెబుతున్నారు. ఒకసారి ఫాగింగ్ చేస్తే కనీసం రూ.5 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని అంటున్నారు.

❖ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి కెక్కిన బాపట్ల మండలం జిల్లెళ్లమూడిలో ఫాగింగ్ చేయడం లేదు. మండలంలోని 28 పంచాయతీల్లో సుమారు 20 వేల జనాభా ఉంటున్నారు. జమ్ములపాలెం, కంకటపాలెం, నర్సాయపాలెం మేజర్ పంచాయతీలు. వీటిల్లో ఫాగింగ్ చేయడం లేదు.

గ్రామాల్లో కనిపించని ఫాగింగ్

నగరం గ్రామంలో ఇలా..

❖ మండల కేంద్రం నగరంలో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. మండలంలోని 27 పంచాయతీల్లో దాదాపు 13 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. మంత్రిపాలెం, నగరం, ధూళిపూడి మేజర్ పంచాయతీలు. పల్లెల్లో ఫాగింగ్ ఊసేలేదు. ఇటీవల ధూళిపూడిలో వైరల్ జ్వరాలు విజృంభించడంతో ఒక రోజు ఫాగింగ్ చేశారు.

❖ పర్చూరు నియోజకవర్గంలో ఆరు మండలాలున్నాయి. మార్టూరు, యద్దనపూడి, పూనూరు, పర్చూరు, కారంచేడు, అన్నంబొట్లవారిపాలెం, ఇంకొల్లు, చినగంజాం మేజర్ పంచాయతీలు. మార్టూరు పంచాయతీకి రూ.2.5 కోట్ల ఆదాయం వస్తోంది. అయినా ఫాగింగ్ చేయడం లేదు. ఇక్కడ ఇతర రాష్ట్రాల కార్మికులు ఉంటున్నారు. పారిశుద్ధ్యం లోపించడంతో రోగాల బారిన పడుతున్నారు. మిగిలిన పంచాయతీలకు ఆదాయం ఉన్నా దోమల నివారణకు చర్యలు చేపట్టడం లేదు.

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్..
'గ్రామాల్లో దోమల నివారణకు త్వరలో ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. అన్ని పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు సరఫరా చేశాం. సమస్య ఉన్నచోట యంత్రాల ద్వారా రాత్రివేళ విధిగా ఫాగింగ్ చేయాల్సిందే' అని డీపీవో ప్రభాకరరావు తెలిపారు.

జిల్లా పరిషత్తులకు భవనాల ఎంపిక

టీటీడీ కల్యాణ మండపంలో బాపట్ల కార్యాలయాలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు పాలకవర్గం గడువు సెప్టెంబరు 24వ తేదీన ముగియనున్న తరుణంలో.. నూతనంగా ఏర్పాటు కానున్న పల్నాడు, బాపట్ల జిల్లా పరిషత్తుల కార్యాలయాలకు అధికారులు భవనాలను ప్రాథమికంగా ఎంపిక చేశారు. పల్నాడు జిల్లా పరిషత్తు కార్యాలయాన్ని నరసరావుపేటకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ములకలచెరువులోని మైనార్టీల పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో ఏర్పాటు చేసేందుకు జడ్పీ అధికారులు నిర్ణయించారు. ఇక్కడ గదులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో ఎంపిక చేశారు. బాపట్ల జిల్లా పరిషత్తు కార్యాలయాన్ని బాపట్లలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రాథమికంగా భవనాలను ఎంపిక చేసి దస్త్రాలు రూపొందించారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన తర్వాత.. నిబంధనల మేరకు ఉంటే వీటిని ఖరారు చేస్తారు. తాత్కాలికంగా రెండు జిల్లాపరిషత్తు కార్యాలయాలను ఈ భవనాల్లో ఏర్పాటు చేస్తారు. ఛైర్మన్, సీఈవో, డిప్యూటీ సీఈవోతో పాట విభాగాల ఏవోలు, సిబ్బంది కోసం కనీసం పది గదులైనా అవసరమవుతాయి. రికార్డులు, దస్త్రాలను భద్రం చేసేందుకు స్టోర్ రూమ్, కంప్యూటర్ రూమ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ఉద్యోగుల్లో ఉత్కంఠ

● మండల పరిషత్తు పాలకవర్గాల గడువు సెప్టెంబరు 23వ తేదీతో ముగియనుంది. జడ్పీ పాలకవర్గం పాలన 24తో ముగుస్తుంది. దీంతో వారం రోజుల ముందే గుంటూరు జిల్లా పరిషత్తు నుంచి పల్నాడు, బాపట్ల జిల్లా పరిషత్తులను వేరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. సీఈవో, డిప్యూటీ సీఈవోలతో పాటు ఉద్యోగులను కేటాయించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి పాలకవర్గాలు కొలువుదీరే వరకు ఆయా జిల్లా కలెక్టర్లను జడ్పీ ప్రత్యేక అధికారులుగా నియమించనున్నారు.

➾ ఉమ్మడి జిల్లా పరిషత్తు ఉద్యోగులను గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిషత్తులకు దామాషా విధానంలో కేటాయించాల్సి ఉండడంతో సిబ్బంది సర్వత్రా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఎవరు ఏ జిల్లా పరిషత్తుకు వెళతారో తెలియని పరిస్థితి ఉండడంతో కొంత ఆందోళనలో ఉన్నారు.

➾ జిల్లా పరిషత్తు పునర్వ్యవస్థీకరణకు ముందే జిల్లా క్యాడర్‌లోని పోస్టుల ఖాళీలను ఉద్యోగులకు పదోన్నతులు ద్వారా భర్తీ చేసేందుకు సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. జడ్పీ విభజన జరిగితే దీర్ఘకాలం పదోన్నతులు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో ఆఫీస్ సబార్డినేట్లు, రికార్డ్, ల్యాబ్ అసిస్టెంట్లు జూనియర్ అసిస్టెంట్లుగా.. జూనియర్ అసిస్టెంట్లు సీనియర్ అసిస్టెంట్లుగా.. ఎస్ఏలు పరిపాలన అధికారులుగా పదోన్నతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

తాత్కాలికంగా ఎంపిక చేశాం

ఉమ్మడి జిల్లా పరిషత్తు పాలకవర్గం గడువు ముగియనుండడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు పల్నాడు, బాపట్ల జిల్లా పరిషత్తు కార్యాలయాల కోసం తాత్కాలిక భవనాలను ఎంపిక చేశాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వాటిని ఏర్పాటు చేస్తాం.
– వి.జ్యోతిబసు, సీఈవో, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు

అదుపు తప్పితే కాలువలోకే..

చిత్రంలో మీరు చూస్తున్న వంతెన చీరాల మండలం బుర్లవారిపాలెం- కీర్తివారిపాలెం గ్రామాల మధ్య స్ట్రయిట్ కట్‌పై ఏళ్ల కిందట నిర్మించారు. నిత్యం రెండు గ్రామాల ప్రజలు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. గవినివారిపాలెం, కావూరిపాలెం వాసులు ప్రయాణిస్తారు. వంతెనపై అప్పట్లో ఏర్పాటు చేసిన రక్షణ స్తంభాలు పూర్తిగా పడిపోయాయి. ఇక్కడ ఏమాత్రం ఆదమరిచి వాహనాలను నడిపినా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. బ్రిడ్జి కరకట్ట కోతకు గురికాకుండా నిర్మించిన గోడ కుంగింది. అధికారులు స్పందించి రక్షణగా స్తంభాలు నిర్మించడంతో పాటు గోడను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చీరాల అర్బన్

స్కానింగ్ పేరుతో స్కామ్

● జీజీహెచ్ ఎంఆర్ఐ విభాగంలో మాయ
● లెక్కల్లో రోజుకు వంద నుంచి 120
● సెలవు రోజుల్లోనూ ఇవే గణాంకాలు

సాధారణంగా ఒక ఎంఆర్ఐ స్కానింగ్‌కు పట్టే సమయం..

➽ మెదడు, తలకైతే 20 నుంచి 45 నిమిషాలు. అదే మోకాలి చిప్ప, భుజం అయితే 15 నుంచి 30. వెన్నెముకకు 20 నుంచి 45. పొట్ట, కటి భాగమైతే 30 నుంచి 60 నిమిషాలు.

➽ ఒక్కో స్కానింగ్‌కు సరాసరి 30 నిమిషాల సమయం తీసుకున్నా.. రోజులో యంత్రాన్ని ఆపకుండా, సిబ్బంది నిరంతరాయంగా చేసినా గరిష్ఠంగా తీసే స్కాన్‌లు 48.

➽ మరి గుంటూరు జీజీహెచ్‌లోని ఎంఆర్ఐ విభాగం రోజుకు ఎన్ని చేస్తోందో తెలుసా?

➽ అక్షరాలా 110 నుంచి 120... అదీ ఒకే యంత్రంపై రద్దీ రోజుల్లేనే కాదు.. శని, ఆదివారాల్లోనూ ఈ సంఖ్య తగ్గడం లేదు.

➽ చివరకు జూడాల సమ్మెతో వార్డులు వెలవెలబోయినా.. ఇక్కడ మాత్రం రద్దీ కొనసాగిందంటూ లెక్కలు చూపుతున్నారు.

ఈనాడు–అమరావతి

దోచిపెట్టే వాళ్లు మన వాళ్లైతే ఏం చేసినా.. ఎలా రాసేసినా చెల్లిపోతుందనడానికి జీజీహెచ్‌లో పీపీపీ విధానంలో సేవలందిస్తున్న ఎంఆర్ఐ విభాగమే నిదర్శనం. రోజువారీ స్కానింగ్‌ల లెక్కలు ముక్కున వేలేసుకునేలా ఉంటున్నాయి. ఈ మాయాజాలంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అవసరం లేకున్నా వైద్యులు అడ్డదిడ్డంగా ఎంఆర్ఐకు రెఫర్ చేస్తున్నారా? ప్రైవేట్ రోగులకూ ఇక్కడే స్కానింగ్ చేస్తున్నారా? లేక నిర్వాహకులే కాకి లెక్కలతో కథ నడిపిస్తున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానాల్లేవు. ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఒక్కో స్కానింగ్‌కు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తుండడంతో జీజీహెచ్‌కు సిఫార్సులు పెరుగుతున్నాయన్న వాదన బలంగా ఉంది.

ఆగస్టులో ఇలా..

తేదీ	స్కానింగ్‌లు
10	129
11	127
12	116
13	121
14	107
15	107
16	122
17	120
18	123
19	114

సంవత్సరం	అడ్మిషన్లు	ఎంఆర్ఐలు
2020	51,107	12,120
2021	73,283	33,821
2022	71,398	34,075
2023	70,933	33,050
2024	63,777	36,705
2025	81,718	41,370
2026 (జూన్ 30)	31,221	20,358

విజిలెన్స్ విచారణ చేస్తేనే...

ఈ లెక్కలపై అధికారులు ప్రశ్నించకపోవడం గమనార్హం. రూ.కోట్ల చెల్లింపులపై విజిలెన్స్ విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకొస్తాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్‌ను 'ఈనాడు' వివరణ కోరగా.. విచారణ చేపడతామని చెప్పారు.

ఏడేళ్లుగా ఇదే పరిస్థితి.. ఏడేళ్లుగా జీజీహెచ్‌లో మొత్తం రోగుల అడ్మిషన్లు, ఏటా తీసిన ఎంఆర్ఐ వివరాలను 'ఈనాడు' సేకరించింది. ఇందులో గణాంకాలు విశ్లేషిస్తే విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. మొత్తం అడ్మిషన్లలో 40 శాతంమందికి పైగానే ఎంఆర్ఐ చేసినట్టుగా గణాంకాలు చెబుతున్నాయి. వీటి ఆధారంగానే చెల్లింపులు చేస్తుండడంతో భారీ మొత్తంలో ప్రభుత్వ ధనం వృథా అవుతోంది.

సేవలకు సుస్తీ.. సీట్లకు కుస్తీ

ఆర్టీసీ ప్రయాణికుల నరకయాతన

గంటల తరబడి బస్టాండ్లలో పడిగాపులు కాస్తున్నాం. బస్సు వస్తే ఎక్కలేని పరిస్థితి. సీట్లు దొరక్క వృద్ధులు, మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. కనీసం గంటన్నర ఎదురుచూస్తే తప్ప బస్సు ఎక్కలేకపోతున్నాం. అధికారులకు ఈ పరిస్థితి కనిపించడం లేదా? రద్దీకి తగ్గట్టుగా బస్సుల సంఖ్య ఎందుకు పెంచడం లేదు?
– గుంటూరు ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో పలువురు ప్రయాణికుల ఆగ్రహమిది..

ఈనాడు – అమరావతి

ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ ప్రయాణం సామాన్యులకు నరకప్రాయంగా మారింది. భారీగా పెరిగిన రద్దీకి తగ్గట్టుగా బస్సుల్లేకపోవడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. గుంటూరు నుంచి బాపట్ల, చీరాల, తెనాలి, మాచర్ల, విజయవాడ వంటి ప్రధాన మార్గాల్లో ప్రయాణించాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. ఆర్టీసీ అధికారుల ప్రణాళిక లోపం వారికి శాపంగా మారింది. జిల్లాలోని గుంటూరు-1, 2, తెనాలి, మంగళగిరి, పొన్నూరు డిపోల పరిధిలో ఉన్న బస్సులు కేవలం 371 (సొంతం 284, అద్దె 87). నిత్యం ప్రయాణిస్తున్నవారు 1.63 లక్షల మంది. ఒక్క ఎన్టీఆర్ బస్‌స్టేషన్ నుంచే ప్రతిరోజూ లక్ష మంది రాకపోకలు సాగిస్తున్నారు.

అరకొర సర్వీసులతో అవస్థలు

రణరంగమే... బస్‌స్టేషన్లలో ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు, వ్యాపారులతో అవి కిక్కిరిసిపోతున్నాయి. పనులు ముగించుకుని వెళ్లే వారితో సాయంత్రం విపరీతమైన రద్దీ ఉంటోంది. బస్సులు పాయింట్లలోకి రాకముందే సీట్ల కోసం ప్రయాణికులు ప్రమాదకరస్థితిలో పరుగులు పెడుతున్నారు. కొంత మంది కదులుతున్న బస్సులు ఎక్కుతున్నారు. దీంతో డ్రైవర్లు పాయింట్ల వద్దకు వేగంగా తీసుకొస్తుండడంతో ప్రమాదాలకు అవకాశం ఉంది. సీట్ల కోసం తోపులాటలు, తీవ్ర వాగ్వాదాలు నిత్యకృత్యమయ్యాయి.

గుంటూరు ఆర్టీసీ బస్టాండులో బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల పోటాపోటీ

స్త్రీశక్తి రద్దీ.. పెరగని బస్సులు

గతేడాది ఆగస్టు 15న ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకంతో రద్దీ అనూహ్యంగా పెరిగింది. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో ఇప్పటివరకు మహిళలు 3.19 కోట్ల ప్రయాణాలను ఉచితంగా చేశారు. రోజువారీ ప్రయాణికుల్లో లక్ష మంది (62%) వారే. పల్లెవెలుగు బస్సుల్లో కాలు మోపలేని పరిస్థితి. రద్దీకి తగ్గట్టుగా బస్సుల్లేకపోవడం సమస్యగా మారింది. జిల్లాలో 18 మండలాలు, 222 గ్రామాలను కలుపుతూ 121 రూట్లలో బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అవస్థలను పట్టించుకోవడం లేదు. బాపట్ల, చీరాల రూట్లలో ప్రత్యేక సర్వీసులు నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కందిపప్పు ఉడకనట్లే..!

❖ నిత్యావసరాల ధరలు పెరిగి వెతలు
❖ రేషన్ సరకులకు పేదల ఎదురుచూపు

❖ బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర కేజీ రూ.125 నుంచి రూ.140 పలుకుతోంది. గత కొన్ని నెలలుగా పప్పు ధరలు పెరగడమే కానీ తగ్గట్లేదు. పంచదార కేజీ రూ.72కి చేరింది. నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. ఇలాంటి తరుణంలో చౌకధరల దుకాణాల్లో తక్కువ ధరకు లభించే సరకుల కోసం వినియోగదారులు ఎదురు చూస్తున్నారు.

బాపట్ల, సత్తెనపల్లి, న్యూస్‌టుడే: చౌకధరల దుకాణాల్లో కందిపప్పు కేజీ రూ.67కే అందిస్తారు. పంచదార కేజీ రూ.34కే లభిస్తుంది. ప్రస్తుతం రేషన్ కార్డుకు అరకేజీ చొప్పున పంచదార ఇస్తున్నారు. ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కనీసం కేజీ చొప్పున పంపిణీ చేయాలని కార్డుదారులు కోరుకుంటున్నారు. కందిపప్పు పంపిణీ గత ఏడాదిన్నరగా నిలిచిపోయింది. అదిగో.. ఇదిగో అంటున్నారే తప్పించి రేషన్ కందిపప్పు పేదింట ఉడకట్లేదు.

సెప్టెంబరు నెలకు పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని చౌకధరల దుకాణాలకు చేరిన సరకులు చూస్తే బియ్యం, పంచదారతోనే సరిపెట్టుకోవాల్సిందే. కందిపప్పు, గోధుమలు, రాగులు, జొన్నలు, సజ్జలు, పామాయిల్, ఉల్లి వంటి నిత్యావసర వస్తువులు లభిస్తాయని కార్డుదారులు ఎప్పటికప్పుడు ఆశ పడుతున్నా నిరాశే ఎదురవుతోంది. పశ్చిమాసియా యుద్ధం, ఎల్‌నినో ప్రభావంతో నిత్యావసరాల ధరలు పెరిగి మధ్యతరగతి, పేద కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రేషన్ దుకాణాల్లో సరకుల సంఖ్య పెంచాలని అల్పాదాయ కుటుంబాలవారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జిల్లాలో చౌకధరల దుకాణాలు **904**

మొత్తం బియ్యం కార్డులు : **3,88,235**

ఓటు హక్కు కల్పించండి సర్

బాపట్ల, న్యూస్‌టుడే

కొత్తగా 8,115 దరఖాస్తులు

జిల్లాలో సర్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఓటు హక్కు కోసం కొత్తగా దరఖాస్తులు 8,115 వచ్చాయి. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలియజేసే గడువు ఆదివారంతో ముగిసింది. ముసాయిదా జాబితాలో ఓట్లు లేని వారు ఓటు హక్కు పొందడానికి (ఫారం-6) ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలోని 1367 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించారు. చివరి రెండు రోజుల్లో ఓటరు జాబితాలో పేరు చేర్చడానికి ఫారం-6 దరఖాస్తులు 628, తొలగించడానికి ఫారం-7 దరఖాస్తులు 09, చిరునామాలో మార్పులు, పేర్లలో తప్పుల సవరణకు ఫారం-8 దరఖాస్తులు 454 వచ్చాయి.

'సర్'కు ముందు జిల్లాలో 10,50,605 మంది ఓటర్లు ఉండేవారు. ఇంటింటా సర్వే తర్వాత.. మృతులు, శాశ్వత వలసలు, చిరునామా లభించని, డబుల్ ఎంట్రీలు కలిపి మొత్తం 1,10,216 మంది ఓటర్లను జాబితా నుంచి తప్పించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో 9,40,389 మంది ఉన్నారు. ఓటు హక్కు కోసం ఎనిమిది వేలకు పైగా ఫారం-6 దరఖాస్తులొచ్చాయి. అధికారులు దరఖాస్తుదారుల్ని విచారించి ఓటర్ల జాబితాలో పేరు చేర్చుతున్నారు. కొత్తగా ఎనిమిది వేల మంది వరకు ఓటర్లు జాబితాలో చేరే అవకాశం ఉంది. అక్టోబరు 3న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నారు. సర్ ప్రక్రియ పూర్తయ్యాక జిల్లాలో 1.02 లక్షల మందికి పైగా ఓటర్లు తగ్గే అవకాశం ఉంది.

నోటీసులు.. విచారణ

మ్యాపింగ్ జరగని, ఎన్యుమరేషన్ ఫారాల్లో తప్పులున్న ఓటర్లు 1,59,116 మందికి బీఎల్వోలు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచారు. నోటీసులు అందుకున్న ఓటర్లలో సోమవారానికి 98,406 మంది విచారణ పూర్తయింది. ఇంకా 60,710 మందిని విచారించాల్సి ఉంది. నోటీసుల విచారణకు సెప్టెంబరు 28వ తేదీ వరకు గడువున్నా పదిలోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు పని చేస్తున్నారు. ఇందుకు అదనంగా ఏఈఆర్వోలను నియమించారు.

మంత్రి లోకేశ్ పల్నాడు పర్యటన రేపు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: తెదేపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సెప్టెంబరు 2న పల్నాడు జిల్లాలో పర్యటించనున్నారు. నరసరావుపేట మండలం కాకాని లోని జేఎన్‌టీయూ కళాశాలలో రూ.70 కోట్లు వెచ్చించి నిర్మించిన వసతి గృహాలను ప్రారంభించనున్నారు. 1,440 మంది విద్యార్థులకు వసతి అందుబాటులోకి రానుంది. ఈ నేపథ్యంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, తెదేపా ప్రాంతీయ సమన్వయకర్త బీటీ నాయుడు, ఎమ్మెల్యే అరవిందబాబు, గుంటూరు మేయర్ కోవెలమూడి నాని సోమవారం జేఎన్‌టీయూ కళాశాలను సందర్శించారు. అక్కడ వేదిక నిర్మాణం, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం తెదేపా కార్యాలయంలో సమావేశమై మాట్లాడుతూ లోకేశ్ పర్యటనను శ్రేణులు విజయవంతం చేయాలన్నారు. వసతిగృహాల ప్రారంభోత్సవం అనంతరం నియోజకవర్గ పార్టీ సమావేశంలో లోకేశ్ పాల్గొంటారని ఎమ్మెల్యే అరవిందబాబు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జానీ సైదా, ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న నేతలు

రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీలకు ఏర్పాట్లు

తాడేపల్లి, న్యూస్‌టుడే: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ పరేడ్ మైదానంలో మంగళవారం సాయంత్రం నిర్వహించనున్న రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీల ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం పరిశీలించారు. ప్రారంభోత్సవానికి డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో భద్రత, పార్కింగ్, తాగునీరు, వసతి, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని, పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. క్రీడల్లో భాగంగా అమరావతి విట్ కళాశాలలో ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ట్రాక్ అండ్ ఫీల్డ్, మంగళగిరిలో ఈత, కృష్ణానదిలో జల క్రీడలు, తాడేపల్లి నులకపేట ఫైరింగ్ రేంజ్‌లో షూటింగ్, ఫైరింగ్ పోటీలు నిర్వహించనున్నారు. స్పెషల్ బ్రాంచి డీఎస్పీ అలహరి శ్రీనివాసు, ఆర్ఐ వెల్ఫేర్ సురేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

రైతేరాజు
దొండ.. రైతన్నకు అండ 6లో
నానో ఎరువు.. పర్యావరణ హితవు

(c) eenadu

అర్జీలు పునరావృతం కారాదు

బాధితుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: సమస్యలపై పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 152 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తులు పునరావృతం కారాదన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, సంతృప్తి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్‌లో ఉత్తమ సేవలు అందించిన భట్టిప్రోలు తహసీల్దారు నాగరాజును ఈ వారం ఉత్తమ అధికారి పురస్కారంతో కలెక్టర్ సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఇన్‌ఛార్జి డీఆర్వో లవన్న, డీఎంహెచ్‌వో విజయమ్మ, డీపీవో ప్రభాకరరావు, డీఎఫ్‌వో సౌజన్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సర్కారు లక్ష్యాలు సాధించేలా పనితీరు అవసరం

బాపట్ల, న్యూస్‌టుడే: అధికారులు, ఉద్యోగులు పని తీరు మెరుగుపరుచుకుని ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్లో సోమవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ ఆదాయ వనరులు పెంచటం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిచ్చి పని చేయాలన్నారు. జిల్లా స్థాయిలో ఏడాదికి 352, నెలకు నియోజకవర్గ స్థాయిలో 15 లక్ష్యాలు సాధించాల్సి ఉందని తెలిపారు. పనితీరు, అభివృద్ధి ప్రామాణికంగా జిల్లా, నియోజకవర్గానికి గ్రేడింగ్ ఉంటుందన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గృహనిర్మాణాలు, వైద్య సేవలు, గ్రామీణ నీటి సరఫరా, సహకార, పోలీసు శాఖలు, పశుసంవర్ధక శాఖ సేవలు, ఉద్యాన పంటల సాగు లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సీపీవో షాలెంరాజు, డీఎంహెచ్‌వో విజయమ్మ, డీపీవో ప్రభాకరరావు, విద్యుత్తు ఎస్ఈ ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వచ్చిన సర్వేయర్లకు నోటీసులు

భూముల సర్వేలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే అవాంతరాలు, లోపాలు అధిగమించాలని ఆదేశించారు. భూముల సర్వే పక్కాగా చేయాలని చెప్పారు. సర్వే కోసం వచ్చిన ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటూ ఇబ్బంది పెట్టరాదన్నారు. సర్వేకు చలానా తప్ప ఎవరికి నగదు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సర్వే ముగిసిన తర్వాత ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని సూచించారు. సర్వే శాఖపై ఎక్కువ ఫిర్యాదులు రావడంపై ఆరా తీశారు. ఫిర్యాదులు వచ్చిన పెరవలి, మూలపాలెం, అనంతవరం, రేపల్లె సర్వేయర్లకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. సర్వేయర్లు పనితీరు మెరుగుపరుచుకోవాలని చెప్పారు. సమావేశంలో సర్వే, భూ దస్త్రాల ఏడీ శేషగిరిరావు, అల్తాఫ్, ఆర్డీవోలు హరికుమార్, నరసింహారావు, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబ సభ్యులు

బాపట్ల: ప్రభుత్వ ఉద్యోగులు తన కుటుంబ సభ్యులని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని ఈటీసీ హాల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేస్తున్న 53 మంది ఉద్యోగులను ఆయన సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు అందించిన సేవలు అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యోగ విరమణ చేసే ప్రతి ఉద్యోగి మొక్క నాటి, సంరక్షించాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డీఆర్వో లవన్న, డీఈవో శ్రీనిహాసింగ్, డీఎంహెచ్‌వో విజయమ్మ, మెప్మా పీడీ ఆనంద్ పాల్, ఏవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032

ఆఫీస్ అడ్రస్ : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైను, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034.

భౌతిక స్వాధీనత ప్రకటన రూలు 8(1) (స్థిరాస్తిపై)

రుణగ్రహీత: లోన్ అకౌంట్ నెం. RPLL1TF2409270002

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి [illegible] రూ.1,59,71,343/- [illegible] తేది.29-05-2026 [illegible] తేది.29-08-2026 [illegible]

స్థిరాస్తుల వివరములు

[illegible] బాబు, దక్షిణం: శ్రీ పెనుమూడి నాగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూమి, పడమర: పంట చేడు(12 మీటర్ల వెడల్పు గల మెయిన్ రోడ్డు), ఉత్తరం: మహ్మద్ ఆలి వగైరాల యొక్క భూమి. పైన తెలిపిన హద్దుల మధ్య ఎ.0.64 సెంట్లు లేదా 3097.6 చ॥గ॥లు విస్తీర్ణం గల వ్యవసాయేతర భూమి మాత్రమే.

(ఈ ఆస్తి రేపల్లె ఎస్.ఆర్.ఓ నందలి దస్తావేజు నెం.4586/2020 కు అనుబంధంగా ఉంటుంది)

తేది : 29-08-2026 సం/- అధీకృత అధికారి,

ప్రదేశం : గుంటూరు. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

'బే ఆఫ్ బాపట్ల' జిల్లా ప్రత్యేక బ్రాండ్

బాపట్ల, న్యూస్‌టుడే: బే ఆఫ్ బాపట్లను జిల్లాకు ఓ ప్రత్యేక బ్రాండ్‌గా తీర్చిదిద్దటానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాకు ప్రత్యేక ఆకర్షణగా ఉన్న సూర్యలంక బీచ్ బే ఆఫ్ బాపట్లను రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా నిలపటానికి కృషి చేయాలన్నారు. సూర్యలంక బీచ్‌కు ఉన్న సహజ సౌందర్యం, సముద్ర తీరం, ఆహ్లాదకర వాతావరణాన్ని మరింతగా వినియోగించుకొని పర్యాటకులను ఆకర్షించేలా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. బీచ్ పరిసరాల్లో పరిశుభ్రత, మౌలిక వసతులు, పార్కింగ్, తాగునీరు, విద్యుత్తు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్వదేశీ దర్శన్ 2.0 పనులు వేగంగా చేస్తున్నట్లు తెలిపారు. సూర్యలంక బీచ్ ప్రత్యేకతలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలన్నారు.

ఎన్ఎంఎం ఉన్నత పాఠశాలపై నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు

గూడవల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని గూడవల్లి ఎన్ఎంఎం ఉన్నత పాఠశాలలో నెలకొన్న అనిశ్చితి ఇంకా తొలగిపోలేదు. పాఠశాల యాజమాన్య కమిటీ వివాదంలో ఇప్పటికే కలెక్టర్, చెరుకుపల్లి ఎంఈవో లాజర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. సోమవారం గూడవల్లికి చెందిన గోగినేని రామానాంజనేయులు, గోగినేని వసంత వెంకటసుబ్బారావు, వీరంకి సాంబశివరావు, సీతా సుబ్బారావు, కొల్లి తల్లాసాయి తదితరులు కలెక్టర్‌ను కలిసి పీజీఆర్ఎస్‌లో మరో అర్జీ అందించారు. పాఠశాల పాత, కొత్త కమిటీల వాస్తవికతను వెలికితీయాలని వారు అర్జీలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నలుగురు సభ్యులతో కూడిన నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో చెరుకుపల్లి ఎంఈవోలు లాజర్, నవీన్‌కుమార్, తహసీల్దార్ తోట సురేష్, ఎంపీడీవో కృష్ణానాయక్‌తో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. సర్ కార్యక్రమం ముగియగానే ఈ వారం చివరకు ఈ కమిటీ విచారణ చేపట్టనుందని ఎంఈవో లాజర్ తెలిపారు.

వేగంగా విచారించండి.. పరిష్కరించండి

సమస్య వింటున్న ఏఎస్పీ సుధాకర్

బాపట్ల, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను చట్ట పరిధిలో వేగంగా విచారించి, పరిష్కరించడం ద్వారా సత్వర న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 54 అర్జీలు వచ్చాయి. బాధితుల సమస్యలను ఎస్పీ, ఏఎస్పీ సుధాకర్, రేపల్లె డీఎస్పీ అబ్దుల్ అజీజ్ అడిగి తెలుసుకున్నారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అర్జీలు పునరావృతం కారాదని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అత్తారింటి వేధింపులు, ఆర్థికపరమైన మోసాలు, స్థల వివాదాలపై ఎక్కువ అర్జీలు వచ్చాయి. సీఐ శ్రీనివాసరావు, ఎస్సై లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

దొండ.. రైతన్నకు అండ

యడ్లపాడు, న్యూస్‌టుడే: పత్తి, మిరప తదితర వాణిజ్య పంటలు సాగులో లాభ నష్టాలు ప్రకృతి, మార్కెట్ ఆధారితం. ఇంకా చెప్పాలంటే దైవాధీనం. సాగులో నష్టాల బారినపడకుండా దొండ పంట సాగు చేసి రెండేళ్ల నుంచి నికర ఆదాయం పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారో రైతు.

రాయితీలను సద్వినియోగం చేసుకుని.. యడ్లపాడు మండలం కొత్తపాలెంకు చెందిన **కాకాని శ్రీనివాసరావు** రెండేళ్ల క్రితం అరెకరం దొండ పంట వేశారు. రాజమహేంద్రవరం నుంచి బెంగాల్ రకం దొండ గడ్డలు కొనుగోలు చేశారు. మొక్కల మధ్య 40 అంగుళాలు, వరుసల మధ్య 60 అంగుళాలు వెడల్పు ఉండేలా మొత్తం 900 దొండ గడ్డలు పాదుల్లో నాటుకున్నారు. ప్రభుత్వం అందజేసిన రూ.40 వేలు రాయితీని సద్వినియోగం చేసుకుని 250 రాతి స్తంభాలు, టాటా జియో తీగ కొనుగోలు చేసి శాశ్వత దొండ పందిరి ఏర్పాటు చేసుకున్నారు. సర్కారు రాయితీని వినియోగించుకుని బిందు సేద్య పరికరాలు కూడా సమకూర్చుకున్నారు. రెండు నెలల్లో దొండ తీగలు పందిరిని అల్లుకున్నాయి. దొండను అధికంగా ఆశించే పండు ఈగ నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించారు. ప్రతిరోజు సగటున 1.40 క్వింటాళ్ల దొండకాయలు కోతకు వస్తున్నాయి. కూలీల అవసరం లేకుండా రైతు కుటుంబ సభ్యులే సొంతంగా పొలం పని చేస్తున్నారు. పంట దిగుబడిని మార్కెట్‌కు తరలించుకుని అమ్ముకుంటున్నారు. సీజన్, పంట నాణ్యత, దిగుబడుల లభ్యత తదితర అంశాల ఆధారంగా మార్కెట్‌లో దొండ కిలో రూ.10 నుంచి రూ.60 వరకు ధర లభిస్తోంది. ఇటీవల పందిరిపై పంట చిక్కగా అల్లుకోవటంతో పైభాగం తొలగించారు. కొత్త చిగురు పందిరికి అల్లుకుని కాపు రావటానికి రెండు నెలల సమయం పట్టింది. త్వరలో పంట కోతకు వస్తుంది.

రోజువారీ ఆదాయం.. సాగు పనులు మా కుటుంబ సభ్యులతో కలిసి సొంతంగా చేసుకుంటామని రైతు తెలిపారు. ప్రతిరోజు ఉదయం భార్య, కుమారుడితో కలిసి చేలో దొండకాయలు కోస్తామని, అమ్మకాల ద్వారా రోజువారీ నగదు చేతికందుతోందన్నారు. ఇప్పటి వరకు పంటకు రూ.2.5 లక్షలు పెట్టుబడి పెట్టగా మార్కెట్‌లో మెరుగైన ధరలు లభించటంతో ఖర్చులు పోను రూ.1.5 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. జూన్, జులై నెలల్లో గరిష్ఠ ధర వచ్చిందన్నారు.

నానో ఎరువు.. పర్యావరణ హితవు

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: ఆధునిక యుగంలో సాంకేతిక వ్యవసాయ పద్ధతులు అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించి మంచి ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి అంకారావు తెలిపారు. ఒకవైపు పెరిగిన ఎరువుల ధరలతో పాటు వాటిని వినియోగించేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులు తగ్గించేందుకు శాస్త్రవేత్తలు పలు రకాల నానో ఎరువులను అందుబాటులోకి తెచ్చారు. వీటి వల్ల పర్యావరణానికి హాని ఉండదు. ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లొచ్చు. డ్రోన్ సహాయంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయవచ్చు. దీంతో సాగులో రవాణా, కూలీ ఖర్చులు తగ్గుతాయని ఏవో వివరించారు. ఆ ఎరువులు, ఉపయోగాలు తెలుసుకుందాం.

యూరియా ప్లస్.. నానో యూరియా ప్లస్ పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించకుండా పంటలకు నత్రజని అవసరాన్ని సమర్థంగా తీరుస్తుంది. వరి, మొక్కజొన్న వంటి పంటలకు మొదటి దశలో 25 నుంచి 30 రోజులు (పిలకలు), రెండో దశ 50 నుంచి 60 రోజులు (పుష్పించే), మూడోసారి అవసరాన్ని బట్టి ఆకులపై పిచికారీ చేస్తే సాధారణ యూరియాతో పోలిస్తే 50 శాతం ఆదా అవుతుంది. 25 మి.లీ మందు 5 లీటర్ల చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నానో డీఏపీ.. ఇందులో నత్రజని 8 భాస్వరం 16 శాతం ఉంటాయి. వీటి కణ పరిమాణం 100 నానో మీటరు కంటే తక్కువగా ఉండటంతో ఆకు కాండంలోని రంధ్రాల ద్వారా సులభంగా మొక్కకు చేరుతుంది. విత్తిన 20 నుంచి 25, 30 నుంచి 35 రోజుల్లో లీటరు నీటికి 2 నుంచి 4 మి.లీ మందును అవసరాన్ని బట్టి ఆకులపై ఒకటి లేదా రెండు సార్లు పిచికారీ చేయడం వల్ల సంప్రదాయ డీఏపీతో పోలిస్తే 50 శాతం వృథాను అరికట్టవచ్చు.

నానో కాపర్.. మొక్కల్లో క్లోరోఫిల్ ఇతర జీవక్రియలను మెరుగుపరుస్తుంది. లీటరు నీటిలో ఒక మి.లీ మందు కలిపి పిచికారీ చేయాలి.

నానోజింక్.. వేరు వ్యవస్థ విస్తరణ, మొక్క పెరుగుదల, పంట దిగుబడికి దోహదపడుతుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రక్షణ కవచంగా పనిచేస్తుంది. లీటరు నీటిలో ఒక మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

సమగ్ర సస్యరక్షణతో మిరపలో దిగుబడులు మెండు

నాదెండ్ల, న్యూస్‌టుడే: ఎల్‌నినో నేపథ్యంలో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బావులు, బోర్లు కింద మిర్చి పంట సాగు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మిర్చి పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై బాపట్ల వ్యవసాయ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శివనారాయణ పలు సూచనలు చేశారు. అవేంటంటే..

❖ మిరప సాగులో దుక్కిని లోతుగా దున్నుకోవాలి. నారు నాటుకునే ముందు ఒక ఎకరానికి 2 క్వింటాళ్ల వేప పిండిని దుక్కిలో వేసుకొని కలియదున్నుకోవాలి. దీని వల్ల నిద్రావస్థలో వేరు, తామర, త్రిప్స్ తెగుళ్లను వ్యాప్తి చెందించే క్రిమికీటకాలను నశింపజేస్తుంది. దీనిలో సహజసిద్ధంగా భాస్వరం, నత్రజని, పొటాష్ కూడా లభిస్తాయి. ❖ మొక్కలు నాటిన తర్వాత ఎకరాకు 10నుంచి 12 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకుంటే రసం పీల్చే పురుగుల బారి నుంచి కాపాడతాయి. ❖ తెల్లదోమ, పేనుబంక వంటి పురుగుల ఉనికిని గుర్తించడానికి పసుపు, బులుగు రంగు అట్టలను ఎకరాకు 10 నుంచి 15 ఏర్పాటు చేసుకోవాలి. ❖ గట్లపై చేను చుట్టూ మొక్కజొన్న, జొన్న పైరు, బంతి, ఆముదం మొక్కలను నాటుకోవాలి. ❖ తోటలో కలుపు లేకుండా చూసుకోవాలి. కలుపు ఉంటే వైరస్, తెగుళ్లకు ఆశ్రమంగా ఉంటుంది.

మిరప పంట

❖ పురుగు కనిపిస్తే విచక్షణారహితంగా పురుగు మందులను వాడకుండా పురుగురకం, ఉద్ధృతి, పంట దశను గుర్తించి మందులను వాడాలి. ఒకే మందును పదేపదే వాడకుండా అవసరాన్ని బట్టి వేర్వేరు మందులను వాడటం ద్వారా పురుగు వ్యాధి నిరోధక శక్తిని తగ్గించవచ్చు.

❖ వేప నూనె లేదా వేపగింజల కషాయాన్ని 10రోజులకు ఒకసారి పిచికారీ చేసుకోవాలి. రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలను పాటిస్తూ, సమస్యను తొలి దశలోనే గుర్తించి తగు చర్యలు తీసుకుంటే మిర్చి పంటలో నష్టాలను తగ్గించుకొని మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

గుంటూరు, న్యూస్‌టుడే :

ప్రశ్న : ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో కొర్ర సాగు చేయొచ్చా, వంగడాలు ఏమిటి? - సురేష్, బడేపురం, తాడికొండ మండలం

సమాధానం : ఎల్‌నినో నేపథ్యంలో ఏర్పడిన వర్షాభావంతో ఎక్కడా పూర్తి స్థాయిలో పంటలు విత్త లేదు. తక్కువ నీటితో తక్కువ పంట కాలంలో సులభంగా పండించుకునే చిరుధాన్య పంటల్లో కొర్ర ఒకటి. ప్రస్తుత పరిస్థితులకు ఇది అనువైనది. పత్తి, వరి పొలాల్లో ప్రత్యామ్నాయంగా నీరు నిల్వ తట్టుకునేది కొర్ర పంట. సస్యరక్షణ : కాండం తొలిచే పురుగు నివారణకు ఎకరానికి కార్బోఫ్యూరాన్ 8 కిలోల గుళికలను సుడులలో 30 రోజులప్పుడే వేసుకోవాలి. లేదా 0.3 మి.లీ కోరాడేన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. అగ్గి తెగులు నివారణకు 0.6 గ్రా బీమ్ పొడిని లీటరు నీటికి కలిపి చల్లాలి.

పంట కాలం	వంగడం పేరు	దిగుబడి (అంచనా)
60 రోజులు	గరుడ	ఎకరానికి 6 క్వింటాళ్లు
70-75 రోజులు	సూర్యనంది	10- 12 క్వింటాళ్లు
85-90 రోజులు	S:a 3156, రేనాడు, మహానంది	11-13 క్వింటాళ్లు

- డాక్టర్ ఎం.నగేష్, ఆంగ్రూ ఏరువాక కేంద్రం సమన్వయకర్త

పర్చూరు ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చాలి

రైతులకు సంఘీభావం తెలిపిన కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

పర్చూరు (మార్టూరు), న్యూస్‌టుడే: పర్చూరు ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం కోరారు. పర్చూరు బొమ్మల కూడలిలో నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు సోమవారం సంఘీభావం తెలిపారు. ఎనిమిది దశాబ్దాల కలగా మారిన పర్చూరు ప్రాంత ప్రజలకు గుంటూరు ఛానల్‌ని పొడిగించి తాగు, సాగు నీరు అందించాలని కోరారు. భూసేకరణకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేలా చూడాలన్నారు. 16వ రోజు దీక్షలో కారంచేడు మండలం దగ్గుబాడు గ్రామస్థులు, వివిధ గ్రామ రైతులు కొల్లా రాజమోహనరావు, తులసి శివనాగేశ్వరరావు, లగడపాటి వీరాంజనేయులు, బండి రాంబాబు, నాయుడు సుబ్బారావు, తోకల కృష్ణమోహన్, తెలగతోటి పేతురు, డేవిడ్ తదితరులున్నారు. అనంతరం పర్చూరు తహసీల్దార్ బ్రహ్మయ్యని రైతులు కలిసి ఉన్నతాధికారులకు నివేదించాలని వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏపీ జేఏసీ అమరావతి నేతలు

బాపట్ల, న్యూస్‌టుడే: ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు ఉద్యమం చేస్తామని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ సీహెచ్ సురేష్‌బాబు అన్నారు. కలెక్టరేట్ వద్ద ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు సోమవారం నిరసన నిర్వహించారు. కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఉద్యమ కార్యాచరణ నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడిచినా ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించలేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరిన రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుకు రాజకీయాలను ఆపాదిస్తూ మంత్రులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. సీఎం, మంత్రివర్గ ఉపసంఘంతో రెండేళ్లుగా చర్చలు జరుపుతున్నా సమస్యల పరిష్కారానికి ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. పేరుకుపోయిన రూ.వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. 2023 నుంచి పీఆర్సీ ఇవ్వాల్సి ఉందన్నారు. పీఆర్సీ ఆలస్యం అవుతున్న నేపథ్యంలో మధ్యంతర భృతి ఇవ్వాలని, ఐదు పెండింగ్ డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు దాచుకున్న నగదు కోసం ఉద్యమం చేయాల్సి వస్తోందన్నారు. మహిళా విభాగం ఛైర్‌పర్సన్ పి.రజని మాట్లాడుతూ ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని, ఉద్యోగులకు న్యాయం చేయాలని మాత్రమే కోరుతున్నామన్నారు. జేఏసీ నేతలు హాజరాబేగం, ఓంకార్, మురళీమోహన్, శ్రీకాంత్, కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి, రమేష్, పెంచలయ్య, కమలాకర్, బ్రహ్మం, రాజేంద్రప్రసాద్, శకుంతల పాల్గొన్నారు.

చలపతి యూనివర్సిటీ వీసీగా బీవీ చౌదరి

చౌదరిని సన్మానిస్తున్న ఛాన్సలర్ సుజిత్‌కుమార్, అధ్యాపకులు

తాడికొండ, న్యూస్‌టుడే: చలపతి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ బి.వి.చౌదరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఛాన్సలర్ డాక్టర్ వై.వి.ఆంజనేయులు మాట్లాడుతూ బి.వి.చౌదరికి విద్య, పరిశోధన రంగాల్లో 30 ఏళ్లకు పైగా అనుభవం ఉందని తెలిపారు. ఐఐటీ దిల్లీ నుంచి ఎంటెక్, పీహెచ్‌డీ పట్టాలు పొందారన్నారు. వెస్ట్ ఇండీస్‌లో సుమారు 25 సంవత్సరాల పాటు డీన్‌గా, ప్రొఫెసర్‌గా సేవలందించారని చెప్పారు. 15 మంది విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించి 175 పరిశోధన పత్రాలు ప్రచురించారని వివరించారు. వైస్ ఛాన్సలర్ బి.వి.చౌదరి మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్య, పరిశోధన రంగాలు, ఆవిష్కరణలను మరింత వృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన పరిశోధన అవకాశాలు, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. అనంతరం ప్రొ ఛాన్సలర్ వై.సుజిత్‌కుమార్, అధ్యాపక బృందం చౌదరిని సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అంకమ్మచెట్టు (రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. రేపల్లెకు చెందిన మండే పార్వతి రేపల్లె మండలం మోళ్లగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. సోమవారం విధుల్లో పాల్గొనేందుకు భర్త నాగయ్య మోటారు సైకిల్‌పై పెనుమూడి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో కృష్ణా జిల్లా అవనిగడ్డ నివాసి సాయిచరణ్(22) పల్సర్ బైక్‌పై రేపల్లె వచ్చి తిరిగి వెళ్తున్నాడు. అంకమ్మచెట్టు నుంచి పెనుమూడి వెళ్లే మార్గంలో టపాసుల గోదాం ఎదుట మలుపు తిరిగేక్రమంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొని, దంపతుల మోటారు సైకిల్‌కు తగిలింది. దీంతో సాయిచరణ్, నాగయ్య, పార్వతి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఇది గమనించిన బాటసారులు 108 సాయంతో క్షతగాత్రులను పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే సాయిచరణ్ మృతిచెందాడని వైద్యులు తెలిపారు. దంపతులకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 257.

కృష్ణా జిల్లాలో వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

అగ్గిపెట్టె వివాదం.. హత్య కేసులో నిందితుడి అరెస్టు

వేమూరు, న్యూస్‌టుడే: హత్య కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు రేపల్లె డీఎస్పీ అజీజ్ బాషా తెలిపారు. ఈ విషయంపై వేమూరు పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 28న రాత్రి 11 గంటల సమయంలో వేమూరు మండలం వెల్లబాడులో ఈపూరి యోహాన్, అదే గ్రామానికి చెందిన చరణ్‌తేజను అగ్గిపెట్టె అడిగాడన్నారు. ఇద్దరు మద్యం మత్తులో ఉండటంతో వారి మధ్య వివాదం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో చరణ్‌తేజ ఇంట్లోని కత్తి తీసుకువచ్చి యోహాన్‌ను వీపుపై పొడవడంతో మరణించాడన్నారు. ఈ కేసులో చరణ్ తేజను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ నఫీజ్ బాషా, ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

112కు ఫోన్ చేయాలి : గ్రామాల్లో చిన్న చిన్న గొడవల కారణంగా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని రేపల్లె డీఎస్పీ తెలిపారు. గొడవ జరిగేటప్పుడే 112కు ఫోన్ చేస్తే సంఘటన స్థలానికి పోలీసులు వస్తారని, లేదంటే ఏదైనా ఆటో ద్వారా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇలా చేయడంతో ప్రాణాలు పోయే అవకాశం ఉండదన్నారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును: బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 73311 65666

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 8142292071.

REAL ESTATE

GENERAL

బాపట్ల SBI నుండి అంబేద్కర్ మార్గ్ వెళ్ళే దారిలో 4 3/4 సె॥ల్లో ఉత్తరం ఫేసింగ్ గల పాత ఇల్లు అమ్మకమునకు కలదు. సంప్ర. 9885095025.

PLOT FOR SALE

GENERAL

గుంటూరు, గుజ్జనగుండ్ల సమీపంలో పెదపలకలూరు నందు CRDA అప్రూవ్డ్ రెసిడెన్షియల్ ప్లాట్స్, CC రోడ్లు, డ్రైనేజీ, కాంపౌండ్ వాల్, ఎలక్ట్రిసిటి మొ.లకు సదుపాయాలతో. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. ✆ 7569991020.

అమరావతి రోడ్డుకు, ఇన్నర్ రింగ్‌రోడ్డుకు దగ్గరలో 700, 300 గజాల ఓపెన్ ప్లాట్ గులాబీ తోటతో సేల్. క్లియర్ టైటిల్.. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 9010334569.

PROPERTY FOR SALE

GENERAL

446 yds house with 8 portions sheets @ mangaldas nagar. 2nd bit vja road @ land cost. ✆ 9494800160

TO LET

WANTED

మంగళగిరి నుండి 5 కిలోమీటర్ల పరిధి లో 4000 sqft గోడౌన్ కావలెను (స్టీల్ డోర్స్ మరియు విండోస్ కొరకు) ✆ 9100994692.

JOBS

WANTED

శ్రీప్రధ లూబ్స్ & పెట్రో కెమికల్స్

AP+TG తెలుగు రాష్ట్రాలకు ఇండస్ట్రీయల్ మరియు కమర్షియల్ ప్రొడక్ట్స్ ముఖ్యంగా MTO, Toluene, Hexane మార్కెటింగ్ కోసం B2B సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.

అనుభవం: 2 TO 8 సం॥లు B2B ఇండస్ట్రీయల్ సేల్స్‌లో పై ప్రొడక్ట్స్ మార్కెటింగ్‌లో అనుభవం / కస్టమర్ పరిచయాలు ఉన్నవారికి ప్రాధాన్యత.

జీతం: 30,000 to 50,000+ ఇన్‌సెంటీవ్స్+TA, DA.

దరఖాస్తుకు పూర్తి బయోడేటా మరియు మిగిలిన వివరాలు పంపించగలరు. vishpt.edu@gmail.com

ఇంటర్వ్యూ Dates: 3-9-26, 4-9-26 టైం: 9 AM to 5 PM Venue : సన్నిధి హోటల్ NRP రోడ్డు, గాంధీనగర్, విజయవాడ.

79812 56333
99890 77477

ఆఫీసు అసిస్టెంట్ కావలెను. బీకాం, 3 సం॥లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం, తెలుగు, ఇంగ్లీష్ భాషలపై పరిజ్ఞానం, రెజ్యూములను kamathamjobs@gmail.com కు పంపగలరు. అర్హతను బట్టి మంచి వేతనం.

ప్రముఖ స్టార్ హోటల్ "గీతా రీజెన్సీ" నందు పనిచేయుటకు రుబ్బింగ్, కెప్టెన్స్, వెయిటర్స్, కిచెన్ అసిస్టెంట్స్, రూమ్ సర్వీస్ వెయిటర్స్, ఆర్డర్ టేకర్స్, హౌస్ కీపింగ్ బాయ్స్, కాఫీ స్టాల్, స్టోర్ కీపర్స్, రెస్టారెంట్ ఇంచార్జి మరియు కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం. సంప్ర. 4/1, అరండల్‌పేట గుంటూరు. 9949077525.

డెలివరీ బాయ్స్ & గర్ల్స్ (పార్ట్ టైం 5-6 గం॥) సంపాదన 20K to 30K. ఆఫీస్ స్టాఫ్ (ఫుల్ టైం 10 గం॥) లొకేషన్ : మంగళగిరి, తాడేపల్లి, నంబూరు, చిన్నకాకాని, వడ్డేశ్వరం, కురుగల్లు, ఫోన్ : 6304669595, లొకేషన్ : సత్తెనపల్లి, పెదకూరపాడు, సాతులూరు, క్రోసూరు, రాజుపాలెం, మేడికొండూరు, ముప్పాళ్ల ✆ 7396569618

విజయవాడలోని ప్రముఖ విద్యాసంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 9182513039

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

వంకాలయపాడులోని ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు రెడిమిక్స్ ప్లాంట్ ఆపరేటర్ కావలెను. 2y-3y అనుభవం గలవారు సంప్ర॥ 8019319415.

తెనాలి బస్టాండ్ నందు RTC బస్సులో టికెట్లు కొట్టుటకు తెనాలి పరిసర ప్రాంతాలవారు కావలెను. జీతము 8500/- సంప్ర॥ సెల్: 8374256672.

పంజాబ్ నేషనల్‌బ్యాంక్ మెట్‌లైఫ్‌లో టీమ్ రిక్రూట్ చేయుటకు మేనేజర్స్ కావలెను. ఆన్‌రోల్ జాబ్ 30K + Incent. వర్క్ ఫ్రమ్ హోమ్. 9949839400, 9032592584

SECURITY GUARDS

Wanted ex army Persons to work as Security Guards at Nambur - 8331029045.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

(c) eenadu

బాపట్ల

•బాపట్ల • రేపల్లె • వేమూరు

రేపల్లెలో తొమ్మిది అర్జీలు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తొమ్మిది అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో కార్యాలయ ఏవో కరుణ కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో మురుగు నీరు పారుదల జరిగేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని, తమ భూమిని సబ్ డివిజన్ చేయాలని, పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని, చెరువును అన్యాక్రాంతం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇసుకరీచ్ నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని, భూమికి కోర్టు ఆర్డరును ఇంప్లిమెంట్ చేయాలని, ఆక్రమణకు గురైన తమ భూమిని ఇప్పించాలని, తమ భూమిని వేరేవారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని రద్దు చేయించాలని అర్జీలు అందజేశారు.

చేనేత సంఘాల్లోని సమస్యలు పరిష్కరించండి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యుడు గొట్టుముక్కల బాలాజీ అన్నారు. సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోవడంతో సంఘాలు బలహీనపడుతున్నాయని పేర్కొన్నారు. కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 2న మంగళగిరిలో సమావేశం జరుగుతుందన్నారు. కార్మికులందరు తరలిరావాలని పిలుపునిచ్చారు. సభ్యులు మురుగుడు సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, కొడాలి రామకోటేశ్వరరావు, డోగిపర్తి రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

నగరం, న్యూస్‌టుడే: నగరం జియో టవర్ రహదారిలో వీధి దీపం వెలగడం లేదు. రాత్రి సమయంలో ఇబ్బంది పడుతున్నాం. - వాకా అర్జున్, స్థానికుడు - జియో రహదారిలో కొత్త వీధి దీపం ఏర్పాటు చేయిస్తాను. **- జక్రియ, కార్యదర్శి, నగరం**

బాపట్ల, న్యూస్‌టుడే:? పట్టణంలోని 26వ వార్డు వింజమూరివారి తోటలోని కాలువల్లో పూడిక తీయకపోవటంతో మురుగు నిలిచి దుర్వాసనతో పాటు దోమల సమస్య తీవ్రంగా ఉంది. **- సుబ్బారావు, కాలనీవాసి** ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువలో పూడిక తొలగించి, మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపడతా. దోమల నివారణ మందులు పిచికారీ చేయిస్తా. **- కృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్**

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : ? చందోలు సచివాలయం నుంచి మసీదుకు వెళ్లే మలుపు వద్ద రోడ్డుపైకి ముళ్లపొదలు రావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.**- హుస్సేన్, చందోలు** ✔ సిబ్బందిని పంపి వెంటనే తొలగించి సమస్య లేకుండా చేస్తా. **- ప్రసాదరావు, కార్యదర్శి, చందోలు**

పెరిగిన బండ్లమ్మ హుండీ ఆదాయం

నగదు లెక్కిస్తున్న భక్తులు

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు బండ్లమ్మ దేవస్థానంలోని హుండీ లెక్కింపు సోమవారం దేవాదాయ శాఖ బాపట్ల డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడి ఆదాయం 99 రోజులకు రూ.9,69,418 వచ్చిందన్నారు. గతంలోకన్నా అమ్మవారి హుండీ ఆదాయం రూ.2,03,834 పెరిగిందన్నారు. అమ్మవారికి చేసే ప్రత్యేక పూజలు, అమావాస్య హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించటంతో భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో ఆదాయం పెరిగిందన్నారు. ఈవో నరసింహమూర్తి, ఛైర్మన్ చక్రధర్ రెడ్డి, ఎస్సై కె.మాధవరావు, పోలీసు సిబ్బంది, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేర నియంత్రణపై అవగాహన

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు గ్రామంలో యువత చెడు దారి పట్టకుండా గ్రామస్థులు అందరూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వాడకంపై నిఘా ఉంచాలని చందోలు ఎస్సై మాధవరావు అన్నారు. సోమవారం మండలంలోని చందోలులో నేర నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలపై అగౌరవంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. ఏఎస్ఐ రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చినుకులు రాలవు.. మొలకలు ఎదగవు

పెరవలి(వేమూరు), చుండూరు, కొల్లూరు, న్యూస్‌టుడే

ఓవైపు ఎండలు వేసవిని తలపిస్తుండగా.. మొలకలు ఎదగక రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. వ్యవసాయ బోర్లు ద్వారా నీరందిస్తున్నా పొలాల్లో నీరు నిలవడం లేదు. ప్రధాన కాల్వల ద్వారా సాగునీరు పూర్తి స్థాయిలో రాకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కాల్వలకు సాగునీరు విడుదల సామర్థ్యం పెంచితే తప్ప పైరును కాపాడుకోలేమని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న కాల్వల్లో నీరు పారుదల కాక కనీసం ఆయిల్ ఇంజిన్‌లకు నీరందడం లేదని చెబుతున్నారు. దీంతో చాలా చోట్ల మొలకలు ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

వేమూరు, రేపల్లె, బాపట్ల ప్రాంతాల్లో రెండు లక్షల ఎకరాల్లో వెదసాగు వేసి 20 నుంచి 40రోజులు అవుతుంది. ప్రధాన కాల్వలోనే నీరు లేకపోతే సాగు ఎలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. తూర్పు కాల్వ, బ్యాంక్ కెనాల్ ద్వారా వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె ప్రాంతానికి నీరందుతుంది. ప్రధాన కాల్వలకు ఎగువన ఉన్న వేమూరు, జంపని పొలాలకు సాగు ప్రశ్నార్థకంగా మారింది. కొల్లూరు మండలంలోని బొద్దులూరుపాడు, రావికంపాడు, భట్టిప్రోలు మండలంలోని అద్దేపల్లి బాడవ పొలాల పరిస్థితి అంతే, తూర్పు కాల్వ పరిధిలోని పోతుమర్రు, జంపని, పెరవలిపాలెం, పెదపూడి, అమృతలూరు, గూడవల్లి పొలాలకు సాగునీటి జాడలేదు.

ఒకటో నంబరు బ్రాంచి కాల్వలో చమురు ఇంజిన్‌కు సైతం అందని నీరు

కాలువల్లో కనిపించని నీటి జాడ

నేను పదెకరాలు కౌలుకు తీసుకుని వెద పద్ధతిలో వరి విత్తాను. పైరు 40 రోజుల దశలో ఉంది. కాలువ ద్వారా నీరు రావడం లేదు. పోని వర్షం కురుస్తుందా అనుకుంటే దాని జాడ కనిపించడం లేదు. ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఆయిల్ ఇంజిన్‌తో పొలాన్ని తడుపుదామనుకుంటే బ్రాంచి కాల్వల్లో నీటి జాడ కనపడటం లేదు. **- కొడాలి వెంకట్రావు, రైతు జంపని**

స్పష్టమైన ప్రకటన చేయలేం

వాస్తవానికి ప్రధాన కాల్వలకే సాగునీరు విడుదల అంతంత మాత్రంగా ఉంది. సాగునీటిపై స్పష్టమైన ప్రకటన చేయలేం. ఇప్పటికే జిల్లాలో 38వేల హెక్టార్లలో సాధారణ పద్ధతిలో, వెదసాగు ద్వారా వరి విత్తారు. **- లక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి**

మూడు రోజులుగా అందని నీరు

ఓవర్‌హెడ్ ట్యాంక్ ఆవరణలో ఇలా..

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: కర్లపాలెం మండలం పేరలిలో మూడు రోజుల నుంచి కుళాయిల ద్వారా తాగునీరు ప్రజలకు అందడంలేదు. దీంతో గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా నెలలో 3 నుంచి నాలుగు సార్లు రెండు, మూడు రోజులకొకసారి చొప్పున అందడంలేదు. క్రమం తప్పకుండా రోజు నీరందించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఓవర్‌హెడ్ ట్యాంక్ ఆవరణలో పైపు లీకై తాగునీరు వృథాగా పోతున్నాయి. ట్యాంక్ ఆవరణ మొత్తం నీటితో నిండిపోయింది.

త్రీఫేజ్ విద్యుత్తు తీగ చోరీ

గ్రామంలో తాగునీటి పథకానికి ఉన్న సుమారు 80 మీటర్ల త్రీఫేజ్ వైరును శనివారం పట్టపగలు దొంగిలించినట్లు పంచాయతీ కార్యదర్శి విన్సెంట్ పాల్ సోమవారం తెలిపారు. దీని వల్ల గ్రామానికి తాగునీరు అందించలేకపోతున్నట్లు చెప్పారు. జులైలో తాగునీటి పథకం దగ్గర అమర్చిన మోటార్‌ను దొంగిలించారని, గతంలోనూ మోటార్లు చోరీ చేశారన్నారు. ప్రస్తుతం 80 మీటర్ల వైరు రూ.7,500 వెచ్చించి కొనుగోలు చేసి, పథకానికి అమరుస్తున్నట్లు తెలిపారు. మంగళవారం గ్రామానికి తాగునీరు అందిస్తామని వివరించారు.

నేడు పోతుమర్రులో ఎమ్మెల్యే పర్యటన

వేమూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా ఎమ్మెల్యే ఆనంద బాబు మంగళవారం పోతుమర్రులో పర్యటించనున్నట్లు తెదేపా వర్గాలు తెలిపాయి. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి సమరసత సమావేశాలు

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 6వ తేదీ వరకు మండల సమావేశాలు నిర్వహించాలని జిల్లా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ సోమవారం కోరారు. 4న కృష్ణ జయంతి, 14న వినాయక చవితిని మత్స్యకార, ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో ఏర్పాటు చేసిన దేవాలయాల వద్ద తప్పనిసరిగా నిర్వహించేలా నేతలు ఏర్పాట్లు చేయాలన్నారు.

స్థలం ఆక్రమణకు యత్నం.. బెదిరింపులపై ఫిర్యాదు

బాపట్ల అర్బన్, న్యూస్‌టుడే: కానిస్టేబుల్ హోదాలో ఉంటూ తమ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తూ, చంపేస్తామని బెదిరిస్తున్నారంటూ చీరాల మండలం దేవినూతల గ్రామానికి చెందిన కాగిత సురేష్ బాపట్ల జిల్లా పోలీస్ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. సురేష్ తండ్రి ప్రసాద్ సుమారు 30 ఏళ్ల క్రితం మద్దిబోయిన సోమయ్య అనే వ్యక్తి వద్ద 5సెంట్ల నివాస స్థలాన్ని ఒప్పంద పత్రం ద్వారా కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నారు. నాటి నుంచి విద్యుత్తు మీటర్, ఇంటి పన్నులను తన పేరుపైనే క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అదే గ్రామానికి చెందిన ఫణి కుమార్, రెండు నెలలుగా కొందరు వ్యక్తులతో వచ్చి స్థలాన్ని ఖాళీ చేయాలని దుర్భాషలాడుతూ దాడులకు పాల్పడుతున్నారని సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని బాధితుడు ఫిర్యాదు చేశారు.

ఇళ్ల స్థలాలకు దివ్యాంగులు విజ్ఞప్తి

ఆర్డీవో హరికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఇంటి స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని దివ్యాంగుల ప్రతినిధి కోకి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో హరికుమార్‌కు ఇళ్లస్థలాలు కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులు సొంత స్థలం, ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ప్రభుత్వం దివ్యాంగుల పరిస్థితిని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని, సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు. జిల్లాలోని ప్రతీ మండలానికి ఒక దివ్యాంగ కాలనీని ఏర్పాటు చేయాలని కోరారు.

'స్థానిక' ఎన్నికలకు 166 పోలింగ్ కేంద్రాలు

వేమూరు, న్యూస్‌టుడే: మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు 166 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం వేమూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద తుది జాబితాను ప్రచురించినట్లు చెప్పారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లకు సంబంధించి అభ్యంతరాలు తెలపడానికి సమయం ఉందన్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు సుభాష్‌చంద్రబోస్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

బాపట్ల, న్యూస్‌టుడే: చెరుకుపల్లి చెన్నకేశవనగర్‌లో తాగునీరందక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అనంత రాజు దృష్టికి గ్రామస్థులు సుజాత, సత్యవతి, ధనలక్ష్మి, మాధవి తీసుకెళ్లారు. పీజీఆర్ఎస్‌లో ఈఈని వారు కలిసి నీటి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన స్పందిస్తూ కొత్తగా పైప్‌లైన్లు వేయించి, కుళాయిల ద్వారా నీరందిస్తామని చెప్పారు. కర్లపాలెం మండలంలో దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఆర్డీవో హరికుమార్‌కు వీహెచ్‌పీఎస్ నేత రాజశేఖర్ వినతిపత్రం అందజేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ అద్దె గృహాల్లో ఉంటూ ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఆర్డీవో స్పందిస్తూ అర్హులకు త్వరలో ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అనంతరాజుకు సమస్య వివరిస్తున్న మహిళలు

పింఛను మంజూరు చేయాలని..

గత తెదేపా ప్రభుత్వ హయాంలో తనకు మంజూరు చేసిన పింఛన్‌ను 2022లో వైకాపా ప్రభుత్వం తొలగించిందని చీరాల మండలం పిట్టువారిపాలేనికి చెందిన అంధుడు ఊసా వీరాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి వాసుబాబు గతంలో పురపాలక సంఘంలో ఒప్పంద కార్మికుడిగా పనిచేశారని కారణం చూపుతూ పింఛను తొలగించడంతో బతుకు భారంగా మారిందన్నారు. ప్రస్తుతం తన తండ్రి ఒప్పంద కార్మికుడిగా పనిచేయటం లేదన్నారు. తన పింఛన్‌ను పునరుద్ధరించి న్యాయం చేయాలని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

మైదానాల్లో మౌలిక సదుపాయాలకు..

ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని క్రీడా మైదానాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులు ఆటలు ఆడేలా ప్రోత్సహించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కృష్ణార్జున కోరారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌ను బీజేవైఎం నేతలు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడా మైదానాలు ఉన్న ప్రైవేటు పాఠశాలలకే అనుమతులు ఇవ్వాలన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను పాఠశాల దశ నుంచే గుర్తించి, సౌకర్యాలు కల్పించి, తగిన శిక్షణతో ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతారని అన్నారు. నేతలు మణికుమార్, భార్గవ్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీజేవైఎం నేతలు అర్జున, మణికుమార్, భార్గవ్‌రెడ్డి

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్

నిరసన తెలుపుతున్న వైద్య ఆరోగ్య శాఖ ఒప్పంద ఉద్యోగులు

బాపట్ల, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని ఉద్యోగుల జేఏసీ నేత కూరపాటి సత్యంరాజు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రాంతీయ ఆసుపత్రిలో ఉద్యోగులు సోమవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు క్రమబద్ధీకరించే వరకు వంద శాతం గ్రాస్ వేతనం, బదిలీల సౌకర్యం, ఉద్యోగి చనిపోతే రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. అనంతరం ఏపీ ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రవికుమార్‌ను కలిసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా సహకరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. నేతలు అనూరాధ, కల్పన, నీలిమ, పరిమళ, నళిని పాల్గొన్నారు.

విషాదంలో అండగా ఉంటామని భరోసా

బాపట్ల అర్బన్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మరణించిన బాపట్ల మండలం సూర్యలంక గ్రామానికి చెందిన కె.శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి సోమవారం పరామర్శించారు. ఈ నెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీలక్ష్మి తీవ్రంగా గాయపడి మృతిచెందిన నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లిన కోన, మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం

పేటేరు(రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: రేపల్లె మండలం పేటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కృష్ణప్రసాద్‌ను సోమవారం సన్మానించారు. ఎంఈవో కేసనశెట్టి సురేష్, హెచ్ఎం చెరుకూరి బాబూజీ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

కొల్లూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరాలో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా మంటలు ఎగసి సోమవారం చినపులివర్రులోని గొరగపూడి మరియదాసుకు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. పక్కనున్న నివాసాలకు వ్యాపించకుండా స్థానికులు నీళ్లు చల్లి, మంటలను ఆర్పివేశారు. రూ.రెండు లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

మొక్కలకు నీరేది.. పార్కుల్లో పచ్చదనమేది?

రైలుపేట(బాపట్ల), న్యూస్‌టుడే

పచ్చదనం లేదు.. ఆహ్లాదకర వాతావరణం కనిపించదు.. పిల్లల ఆట వస్తువులు మూలకు చేరాయి. . ప్రజలు ఉదయం, సాయంత్రం వచ్చి పార్కుల్లో కొద్ది సేపు గడిపే పరిస్థితి లేదు. ఇదీ జిల్లా కేంద్రం బాపట్ల రైలుపేటలో పురపాలక పార్కుల దుస్థితి.

❖ రైలుపేటలో ఎనిమిది వార్డులు ఉండగా పట్టణ జనాభాలో 30 శాతం ఈ ప్రాంతంలో ఉంది. పొట్టిశ్రీరాములు పార్కు లోతట్టులో ఉంది. పెద్దగా వర్షం కురిస్తే నీరు నిలుస్తోంది. పార్కులో నిర్మించిన సామాజిక భవనాన్ని వార్డు సచివాలయంగా మార్చారు. గతంలో పాదచారుల నడక కోసం నిర్మించిన ట్రాక్ దెబ్బతింది. కనీస నిర్వహణ లేకపోవడంతో పచ్చదనం పూర్తిగా కనుమరుగైంది. పిల్లలు ఆడుకోవటానికి ఆట వస్తువులు లేవు. ప్రజలు కూర్చోవడానికి ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలు పాతబడ్డాయి. కొత్తగా మొక్కలు నాటి పెంచటం లేదు.

ఆర్వోబీ కింద ఉద్యానవనంలో ఎండిపోతున్న మొక్కలు

అభివృద్ధికి నోచుకోని పొట్టి శ్రీరాములు పార్కు

❖ జమ్ములపాలెం ఆర్వోబీ కింద రెండు, మూడు వార్డుల మధ్య ఎస్సీ ఉప ప్రణాళిక నిధులు రూ.80 లక్షలు ఖర్చు చేసి, 2017లో కొత్త పార్కును అభివృద్ధి చేశారు. మొక్కలు ఎండిపోకుండా రోజూ నీరు పెట్టడానికి మోటార్‌తో డ్రిప్ వ్యవస్థ అనుసంధానం చేశారు. ఐదేళ్ల వరకు ఉద్యానవనంలో పచ్చదనం బాగానే ఉంది. వైకాపా పాలనలో పార్కు నిర్వహణను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దృష్టి పెట్టలేదు. ఉద్యానవనంలో కొంత భాగం ధ్వంసమైంది. మొక్కలకు నీరందించే డ్రిప్, స్ప్రింక్లర్ల పైపులైన్ విరిగిపోయింది. 60 శాతం మొక్కలు ఎండిపోయాయి. పిచ్చిమొక్కలు మొలిచినా తొలగించలేదు. ప్రైవేటు వ్యక్తులు పార్కును తమ అవసరాలకు వినియోగిస్తున్నారు. కంచె దెబ్బతినడంతో గేదెలు, ఆవులు వచ్చి మొక్కలను తినేస్తున్నాయి.

❖ పురపాలక అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రెండు పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రైలుపేట వాసులు కోరుతున్నారు. పొట్టిశ్రీరాములు పార్కులో మెరక వేసి కొత్త మొక్కలు నాటడంతో పాటు పిల్లలకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలి. ఆర్వోబీ కింద పార్కులో పిచ్చిమొక్కలు, ఎండిపోయిన మొక్కలను తొలగించాలి. మళ్లీ మొక్కలు నాటాలి. కొత్త పైప్‌లైన్లు వేసి మొక్కలు ఎండిపోకుండా రోజూ నీటితో తడి ఇవ్వాలి. ధ్వంసమైన పార్కు భాగాన్ని పునరుద్ధరించాలి. తిరిగి కంచె వేయాలి. పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలి. నడక ట్రాక్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. పార్కుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి. పురపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెండు పార్కుల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించి నిధులు, అనుమతి మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రైవేటు బస్సుల్లో ఆకస్మిక తనిఖీలు

బాపట్ల అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణే ధ్యేయంగా ప్రైవేటు బస్సులపై పోలీసులు నిఘా తీవ్రతరం చేశారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బాపట్ల పట్టణ పరిధిలోని సీబీజెడ్ చర్చి సెంటర్ వద్ద హైదరాబాద్-బెంగళూరు మార్గంలో రాకపోకలు సాగించే పలు ప్రైవేటు బస్సులను చందోలు ఎస్సై మాధవరావు నేతృత్వంలో సోమవారం తనిఖీ చేశారు. దీనిలో భాగంగా పర్యాటక, ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్ పత్రాలు, డ్రైవర్ల లైసెన్సులు, ఇతర తప్పనిసరి ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం బస్సు డ్రైవర్లను బ్రీత్ ఎనలైజర్ల ద్వారా పరీక్షించారు. బస్సుల్లో ప్రయాణికుల భద్రతకు సంబంధించి అమల్లో ఉన్న నిబంధనలు, అత్యవసర ద్వారాలు, భద్రతా ప్రమాణాలను అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాధవరావు మాట్లాడుతూ.. వాహనాలకు సక్రమమైన ఫిట్‌నెస్ పత్రాలు ఉండాలని, ప్రయాణికుల క్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. మద్యం తాగి, వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బస్సు డ్రైవర్‌ను పరీక్షిస్తున్న ఎస్సై మాధవరావు

28 మంది ఉద్యోగాలకు అర్హత

వేమూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి సంస్థ కల్పిస్తున్న ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వేమూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విజయబాబు తెలిపారు. వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. దీనిలో 11 కంపెనీలు పాల్గొనగా, మౌఖిక పరీక్షకు 65 మంది హాజరయ్యారు. అందులో 28 మంది వివిధ ఉద్యోగాలకు అర్హత పొందారు. వారికి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి మాధవి, ప్రిన్సిపల్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

యువకులతో అధికారి మాధవి, ప్రిన్సిపల్ గాయత్రి

పేదల అవసరాలు తీర్చే రంగయ్య సత్రం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో పేదల అవసరాలు తీర్చటానికి కంబాల రంగయ్య సత్రాన్ని పునర్నిర్మించినట్లు మాజీ ఎమ్మెల్సీ భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. భీమావారిపాలెంలో సతీష్ సొంత నిధులు రూ.56 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన కంబాల రంగయ్య సత్రం నూతన భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. అన్నం మాట్లాడుతూ పేదల కోసం దాత కంబాల రంగయ్య బాపట్లలో సత్రం నిర్మించి, తన ఆస్తి మొత్తాన్ని దేవాదాయ శాఖకు అందజేశారని తెలిపారు. సత్రం భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు తన వ్యక్తిగత నిధులతో సత్రానికి నూతన భవనం నిర్మించినట్లు చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ ఛైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి, సీనియర్ నాయకులు గిరిజారాణి, ట్రస్టు సభ్యులు లేళ్ల నాగేశ్వరరావు, లేళ్ల వెంకటస్వామి, లేళ్ల సత్యనారాయణ, ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి, లేళ్ల నరేంద్ర, రౌతు రామాంజనేయులు పాల్గొన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్

మంచి నిర్ణయాలతో జీవితాలు అభివృద్ధి

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు మంచి నిర్ణయాలు తీసుకోవడంతో వారి జీవితాలు అభివృద్ధి పథంలో ఉంటాయని జిల్లా గర్ల్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి చారులత అన్నారు. పట్టణంలోని పీఎంశ్రీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా కౌన్సెలింగ్ బృందం సోమవారం విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విద్యార్థులు ఉపాధ్యాయులతో, తల్లిదండ్రులతో తమ సమస్యలు పంచుకోవాలన్నారు. ఎలాంటి రహస్యాలు దాచకుండా వారికి వివరించాలన్నారు. జిల్లా కౌన్సిలర్లు వేణుగోపాల్, సౌజన్య, నాగలక్ష్మి, రామకృష్ణారెడ్డి, జవహర్, ఇందిర, కల్యాణ్ తదితరులున్నారు.

కూటమి పాలనలో వేగంగా ప్రగతి పనులు

ఉల్లిపాలెం(నగరం), న్యూస్‌టుడే: కూటమి పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఎస్సీ సెల్ నాయకులు చిలకా చంద్రబాబు, సుబ్బయ్యలు పేర్కొన్నారు. ఇంటింటికీ తెదేపాలో భాగంగా సోమవారం ఉల్లిపాలెంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

వైభవంగా ముగిసిన కనక దుర్గమ్మ ఉత్సవాలు

నిజాంపట్నం, న్యూస్‌టుడే: మండల కేంద్రం నిజాంపట్నంలో కనకదుర్గమ్మ ఉత్సవాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి, బోట్ల యజమానులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

కన్యకాపరమేశ్వరికి ముత్యాలహారం వితరణ

ఫతేనగర్, న్యూస్‌టుడే: ఫతేనగర్ నేతాజీకాలనీలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి రేపల్లెకు చెందిన వరప్రసాద్, అమ్మాణి దంపతులు సోమవారం ముత్యాలహారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ శివపురం రామయోగి ఆధ్వర్యంలో సభ్యులు వారిని శాలువాతో సత్కరించారు.

చెరువులో అక్రమంగా మట్టి తవ్వకం

నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని నడింపల్లి పంచాయతీ సమీపంలో బస్టాండ్ వద్ద ఉన్న పంచాయతీ చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి మట్టి తవ్వినట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం చెరువులో మట్టిని యంత్ర సాయంతో తవ్వినట్లు గుర్తించారు. అనుమతి లేకుండా ఇలా మట్టి తవ్వడాన్ని గ్రామస్థులు ఖండించారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

బాపట్లలో చిరు వ్యాపారిపై దాడి

బాపట్ల అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని అన్నపూర్ణ థియేటర్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం 3:44 గంటల సమయంలో కొత్తపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు బాదంపాలు బండి పెట్టుకున్న వ్యక్తిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇక్కడ బండి ఎందుకు పెట్టావు అంటూ ఆ వ్యాపారితో వాగ్వాదానికి దిగారు. బాదంపాలు బండిని ధ్వంసం చేసి, ఘర్షణకు దిగారు. సమీపంలోని వ్యాపారులు, బాటసారులు అప్రమత్తమవ్వడంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. కొత్తపేటకు చెందిన ఈ వ్యక్తులు కొంతకాలంగా అన్నపూర్ణ థియేటర్, కొత్తపేట, బస్టాండ్ సెంటర్ పరిసర ప్రాంతాల్లోని చిరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని మామూళ్ల కోసం వేధిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీరి వివరాలు తెలియరాలేదని, ఈ నేపథ్యంలో సీసీటీవీలో రికార్డు అయిన దృశ్యాలను పరిగణనలోకి తీసుకుని దుండగులను గుర్తించి, అదుపులోకి తీసుకొని విచారణ చేపడతామని పట్టణ ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

పురపాలక స్థలాన్ని కాపాడాలని డిమాండ్

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఎస్సీ కార్పొరేషన్ వాణిజ్య దుకాణాల సముదాయం వెనుక ఉన్న పురపాలక స్థలం ఆక్రమణలకు గురైందని ఇన్‌ఛార్జి కమిషనర్ కృష్ణారెడ్డికి ఆటో కార్మికుల సంఘం నేతలు పూర్ణచంద్రరావు, సింహాద్రి సోమవారం ఫిర్యాదు చేశారు. పురపాలక కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ ఆక్రమణ తొలగించి, స్థలాన్ని కాపాడాలని అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసిన స్పందన లేకపోవటం బాధాకరమన్నారు. పురపాలక స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. నేతలు యోహాను, శ్రీనివాసరావు, వెంకట్రావు, గోపిరాజు పాల్గొన్నారు.

అంతిమ రథం కొనుగోలుకు ఆర్థిక సాయానికి వినతి

బాపట్ల, న్యూస్‌టుడే: మల్లికార్జున బృందావనం కాలనీ హిందూ శ్మశానవాటిక కోసం అంతిమ రథం కొనుగోలుకు సాయం అందించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్‌కు మానవతా సంస్థ ఛైర్మన్ శరత్‌బోస్, అధ్యక్షుడు శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. సతీష్‌ను సోమవారం కలిసిన మానవతా ప్రతినిధులు మాట్లాడుతూ అంతిమ రథాన్ని పేద కుటుంబాలకు ఉచితంగా సమకూర్చుతామన్నారు. కొత్త వాహనం కొనుగోలుకు రూ.7 లక్షలు కావాల్సి ఉండగా, దాతలు ఇప్పటి వరకు రూ.3.50 లక్షల సాయం చేసినట్లు తెలిపారు. మిగిలిన నగదు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతినిధులు హరిబాబు, నరేంద్ర, ప్రమీలారాణి, కృష్ణారావు పాల్గొన్నారు.

చీరాల

• చీరాల • పర్చూరు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

స్థానికులతో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపాలెం పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ సోమవారం పరిశీలించారు. ఐదేళ్ల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ముసాయిదా జాబితా స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్ల జాబితాలను ప్రజల కోసం ఉంచారు. నోటీసుల విభాగం పూర్తి చేసి ఆయా కేంద్రాల వద్ద వసతులు, పరిస్థితులను పరిశీలించారు. 26 పంచాయతీల్లో 240 వార్డుల్లో 240 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగు పడాలని గ్రామస్థుల నిరసన

మార్కెట్ కూడలిలో ఆందోళన చేస్తున్న స్థానికులు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల మండలం ఈపూరుపాలెం జిల్లాలోనే అతి పెద్ద పంచాయతీల్లో ఒకటైనా పారిశుద్ధ్యం పూర్తిగా లోపించడంతో వ్యాధులు పొంచి ఉన్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గ్రామంలోని మార్కెట్ కూడలిలో పాటు గ్రామంలోని పలు ప్రాంతాల్లోని దుస్థితిపై చిత్రాలతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శించారు. తమ కష్టాలను జిల్లా కలెక్టర్‌కు స్వయంగా విన్నవించడానికి ఆటోల్లో కలెక్టరేట్‌కు వెళ్లారు. గ్రామ సమస్య నివారణకు గ్రామ యువత ఒక్క తాటిపై నిలవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల: 9154846713 వేటపాలెం: 8008574099
చీరాల గ్రామీణ: 6309994673 పర్చూరు: 9063144743
మార్టూరు: 8008574106 ఇంకొల్లు: 8008574102
చినగంజాం: 8008574103

చీరాల, న్యూస్‌టుడే: ? పాపరాజుతోట రామస్తంభం వెనుక రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రులు ఇబ్బంది పడుతున్నాం. **- సాంబశివరావు, స్థానికుడు**
✔ సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం.
- బాషా, విద్యుత్తు సెక్షన్ ఇన్‌ఛార్జి, పురపాలక సంఘం

మార్టూరు, న్యూస్‌టుడే: ? మార్టూరు కోరీకుంటల్లో రోడ్డువెంట వేసిన చెత్త పేరుకుపోయింది. తొలగించి దుర్వాసన లేకుండా చర్యలు చేపట్టాలి. **- మస్తాన్‌వలి, మార్టూరు**
✔ చెత్త తొలగింపునకు సిబ్బందిని పంపించి తగిన చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్, ప్రత్యేక అధికారి**

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ? పాత చెన్నై రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా పలుచోట్ల అంచుల్లో మట్టి తొలగించి వదిలేశారు. రాత్రుళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. మట్టి తొలగించిన ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. **- నార్నె దిలీప్, ఇంకొల్లు** ✔ గుత్తేదారులతో మాట్లాడి అవసరమైన చోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. **- శ్రీకాంత్ ఆర్‌అండ్‌బీ ఏఈ, ఇంకొల్లు**

దేశాయిపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: ? ఆనుమల్లిపేటలోని మహాలక్ష్మమ్మ చెట్టు పక్క వీధిలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రులు అటువైపు వెళ్లాంటే ఇబ్బందిగా ఉంది. **- సుబ్బారావు, స్థానికుడు**
✔ వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేయించి ఇబ్బంది లేకుండా చూస్తాం. **- మాల్యాద్రి, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి, దేశాయిపేట**

పర్చూరుని కరవు మండలంగా ప్రకటించాలి

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న పర్చూరు ప్రాంత ప్రజల అవసరాల దృష్ట్యా మండలాన్ని కరవు ప్రాంతంగా ప్రకటించి వెంటనే ప్రజలను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకుడు బత్తుల హనుమంతరావు కోరారు. సోమవారం పర్చూరు బొమ్మల కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు పంట రుణాలను రీ-షెడ్యూల్ చేయాలని, రాయితీపై విత్తనాలు, పశుగ్రాసం అందజేయాలని డిమాండ్ చేశారు.

కుల ధ్రువీకరణ పత్రం కోసం వినతి

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని బొల్లాపల్లికి చెందిన బేడబుడగ జంగం కులానికి చెందిన పలువురు ప్రజలు కులధ్రువీకరణ పత్రం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం పీజీఆర్‌ఎస్‌లో తహసీల్దార్ ప్రశాంతికి ఆ వర్గీయులు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన వేల్పూరు ఎబినేజర్ తనకు ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు అందులో తెలిపారు.

ప్రాధాన్యక్రమంలో సమస్యల పరిష్కారం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఒక వినతి మాత్రమే అందిందని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. దేవదాయ శాఖకు సంబంధించి జాయింట్ ఇన్‌స్పెక్షన్ కోసం వినతి అందజేశారు. గతంలో అందిన వినతులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, పీఆర్, గ్రామీణ నీటిసరఫరా, ఉపాధి, వెలుగు, ఐసీడీఎస్, గృహనిర్మాణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేపపిల్లల పెంపక కేంద్రం.. అసాంఘిక శక్తులకు ఆవాసం

కారంచేడు, మార్టూరు, న్యూస్‌టుడే

కారంచేడు గ్రామంలో వృథాగా చేపల నీటి తొట్లు

చేపపిల్లల పెంపకం కేంద్రంలో మద్యం సీసాలు

ఏపీలో చేపల పెంపకం కింద చేపపిల్లలను ప్రత్యేక శ్రద్ధతో పెంచి మత్స్యకారులకు సహకారం అందించాలనే ప్రభుత్వ సంకల్పం. మూతపడి, శిథిలావస్థకు చేరిన పెంపకం కేంద్రాల తీరుతో ఆశయం నీరుగారిపోతోంది. చీరాల సముద్రానికి అత్యంత సమీపంలో కొమ్మమూరు కాలువ చెంతనే ఉన్న నియోజకవర్గంలోని కారంచేడు కేంద్రంగా దశాబ్దాల కిందటే పెద్దఎత్తున చేపపిల్లల పెంపకానికి అనువైన ఏర్పాట్లతో ఓ కేంద్రాన్ని సమకూర్చారు. అయితే తొలినాళ్లలో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో పిల్లల పెంపకంతో ఉత్సాహంగా సాగిన సాగు రానురాను పడిపోయింది. కొన్నేళ్లుగా చేపల పెంపకం అటకెక్కింది. దీంతో కేంద్రంలోని భవనాలు, పరికరాలు, నీటి తొట్టెలు దెబ్బతింటున్నాయి.

ఏళ్ల తరబడి మూతపడి

భవనం పెచ్చులు ఊడి..

గత ఆరేళ్లుగా కారంచేడులోని చేపపిల్లల పెంపకం కేంద్రం మూతపడింది. అందులో ఉన్న కాపలాదారు భవనం శ్లాబు పెచ్చులు రాలిపోయి, తలుపులు ధ్వంసమయ్యాయి. బోటు, పిల్లల కోసం వినియోగించే డబ్బాలు వినియోగం లేక కేంద్రం లోపల వృథాగా చెడిపోతున్నాయి. చేపల పెంపకానికి వినియోగించే తొట్లు మరమ్మతులకు గురయ్యాయి.

జాలర్ల సహకార సంఘం ఏర్పాటు

కేంద్రం ప్రారంభమైన తొలినాళ్లలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో వేలాది పిల్లలను తొట్లలో వదిలి పెంచారు. ఇందు కోసం సుమారు 18 తొట్లను నిర్మించారు. ఇవి పెరిగి పెద్దయ్యాక సమీపంలోని జలాశయాల్లో వదిలేవారు. కొన్ని ప్రాంతాలకు ఆ శాఖ సహకారం సంఘం నేతృత్వంలో ఉచితంగా పిల్లలను సరఫరా చేసేవారు. కొన్ని జాలర్ల సహకార సంఘం తోడ్పాటుతో వీటిని పెంచి తర్వాత జాలర్లు పట్టుకుని అమ్ముకునేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి జీవనం సాగించేవారు.

మందుబాబులకు అడ్డాగా

గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసిన చేపపిల్లల పెంపకం కేంద్రం. మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ వైపు జనసంచారం లేకపోవడంతో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు ప్రధాన నెలవైంది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అసాంఘిక శక్తులు తమ కార్యకలాపాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. అడిగేవారు, పర్యవేక్షించే వారు లేకపోవడంతో మందుబాబులు తమ ప్రధాన కేంద్రంగా మలచుకున్నారు. మద్యం తాగిన తర్వాత సీసాలను ఇష్టానుసారం ఆవరణలోనే పడేస్తున్నారు. దీనిపై మత్స్యశాఖ అధికారుల చరవాణికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా స్పందించలేదు.

స్థలం ఆక్రమణకు యత్నం బెదిరింపులపై ఫిర్యాదు

బాపట్ల అర్బన్, న్యూస్‌టుడే: కానిస్టేబుల్ హోదాలో ఉంటూ తమ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తూ, చంపేస్తామని బెదిరిస్తున్నారంటూ చీరాల మండలం దేవినూతల గ్రామానికి చెందిన కాగిత సురేష్ బాపట్ల జిల్లా పోలీస్ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. సురేష్ తండ్రి ప్రసాద్ సుమారు 30 ఏళ్ల క్రితం మద్దిబోయిన సోమయ్య అనే వ్యక్తి వద్ద 5సెంట్ల నివాస స్థలాన్ని ఒప్పంద పత్రం ద్వారా కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నారు. నాటి నుంచి విద్యుత్తు మీటర్, ఇంటి పన్నులను తన పేరుపైనే క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అదే గ్రామానికి చెందిన ఫణికుమార్, రెండు నెలలుగా కొందరు వ్యక్తులతో వచ్చి స్థలాన్ని ఖాళీ చేయాలని దుర్భాషలాడుతూ దాడులకు పాల్పడుతున్నారని సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని బాధితుడు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో పశువుల మృత్యువాత

చీరాల అర్బన్: వాడరేవు-పిడుగురాళ్ల రోడ్డులో విజయనగర్ కాలనీ సమీపంలో కారు ఢీకొని మూడుగేదెలు సోమవారం రాత్రి మృతిచెందాయి. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనా స్థలానికి రెండో పట్టణ పోలీసులు వెళ్లి పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

కరవు నేలకు కృష్ణమ్మను తెచ్చిన ఘనత చంద్రబాబుదే: ఎమ్మెల్యేలు

చీరాల, మార్టూరు, న్యూస్‌టుడే: కరవు నేలకు వెలిగొండ ద్వారా కృష్ణమ్మను తెచ్చిన ఘనత సీఎం చంద్రబాబునాయుడిదే అని చీరాల, పర్చూరు ఎమ్మెల్యేలు మాలకొండయ్య, సాంబశివరావు అన్నారు. ఎన్నికల ముందు నీళ్లు లేని ప్రాజెక్టును సెట్టింగ్‌లతో జాతికి అంకితం చేసిన జగన్ ప్రజలు మోసం చేశాడని తెలిపారు. వెలిగొండకు శంకుస్థాపన నుంచి నేడు ప్రాజెక్టు పనులు పూర్తి చేసి కృష్ణా జలాలను విడుదల చేసింది చంద్రబాబునాయుడే అని గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో నియోజకవర్గంలో రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సీఎం చంద్రబాబునాయుడిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కలిసినట్లు క్యాంపు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ఆగిన బస్సు.. ఇబ్బంది పడిన ప్రయాణికులు

మరమ్మతులకు గురైన ఆర్టీసీ బస్సు వద్ద పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

అడుసుమల్లి(పర్చూరు, మార్టూరు), న్యూస్‌టుడే: అధిక సంఖ్యలో ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా మరమ్మతులకు గురవడంతో పెద్దసంఖ్యలో ప్రయాణికులు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం పర్చూరు నుంచి గుంటూరుకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు మండలంలోని పర్చూరు, బోడవాడ, అడుసుమల్లి, చిననందిపాడు గ్రామాలకు చెందిన 120 మంది ప్రయాణికులతో పెదనందిపాడు చేరుకుంది. అదే సమయంలో టైరు పంక్చర్ కావడంతో రోడ్డుపైనే నిలిచిపోయింది. పర్చూరు మండలానికి చెందిన ప్రయాణికులు ప్రత్తిపాడు, గుంటూరుకు అత్యవసర పనులు, వైద్యసేవలకు వెళ్లేవారు బస్సు ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా 56 మంది ప్రయాణికుల సామర్థ్యం ఉన్న బస్సులో సోమవారం కావడంతో 120 మంది ఎక్కారన్నారు. వీరిలో అధికంగా మహిళలు ఉండడం గమనార్హం.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

పున్నారావు (పాత చిత్రం)

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 759వ నేత్రదానం జరిగింది. చిలకలూరిపేటకు చెందిన పిన్నమనేని పున్నారావు(93) సోమవారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల సమాచారంతో రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు జెట్టి స్వామి, ఎస్.రామమోహనరావు పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని పిలిపించి మృతుడి కార్నియాలను సేకరించారు. దాత కుటుంబ సభ్యులు అంజమ్మ, శ్రీనివాసరావు, జయలక్ష్మి, వీరశేఖరబాబులను రోటరీ ప్రతినిధులు రాఘవరెడ్డి, నాగేశ్వరరావు, కిషోర్ అభినందించారు.

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం చరిత్రాత్మకం

హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

చీరాల, న్యూస్‌టుడే: శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నల్లమలసాగర్ వరకు నీటిని తెచ్చే క్రమంలో కొండలను తొలచి నీటిని తెచ్చి ప్రాజెక్టు ప్రారంభించడం చరిత్రాత్మకమని నవ్యాంధ్ర చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోటా వెంకటేశ్వరరెడ్డి అన్నారు. వెలిగొండ ప్రాజక్టును ప్రారంభించిన సందర్భంగా సోమవారం చీరాల పట్టణంలోని ఘంటసాల విగ్రహం వద్ద నవ్యాంధ్ర చైతన్యవేదిక ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. విభజన అనంతరం రాష్ట్రం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొందన్నారు. అభివృద్ధి పనులను అందరూ ఆహ్వానించాలని కోరారు. కనకమోహనరావు, లక్ష్మణరావు, డేవిడ్‌రాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్తు తీగ చోరీ

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: కర్లపాలెం మండలం పేరలిలో గ్రామంలో తాగునీటి పథకానికి ఉన్న సుమారు 80 మీటర్ల త్రీఫేజ్ వైరును శనివారం పట్టపగలు దొంగిలించినట్లు పంచాయతీ కార్యదర్శి విన్సెంట్ పాల్ సోమవారం తెలిపారు. దీనివల్ల గ్రామానికి తాగునీరు అందించలేకపోతున్నట్లు చెప్పారు. జులైలో తాగునీటి పథకం దగ్గర అమర్చిన మోటార్‌ను దొంగిలించారని, గతంలోనూ మోటార్లు చోరీ చేశారన్నారు. ప్రస్తుతం 80 మీటర్ల వైరు రూ.7,500 వెచ్చించి కొనుగోలు చేసి, పథకానికి అమరుస్తున్నట్లు తెలిపారు. మంగళవారం గ్రామానికి తాగునీరు అందిస్తామని వివరించారు.

హోమియోలో మెరుగైన వైద్యసేవలు

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: కారంచేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం రోగులకు హోమియో వైద్య సేవలు చేరువ అయ్యాయి. స్వర్ణ ప్రభుత్వ హోమియో డాక్టర్ ప్రదీప్ నేతృత్వంలో పలువురు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోలో మెరుగైన సేవలు ఉన్నాయని తెలిపారు.

భూ సర్వే కోసం వినతులు

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: రైతులు తమ భూముల సర్వే కోసం సోమవారం కారంచేడు తహసీల్దార్ మాధవీలతకు వినతులు అందజేశారు. ఎంపీడీవో నేతాజీతో కలిసి రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. సర్వేకి సంబంధించి ఇద్దరు రైతులు అర్జీలు ఇవ్వగా పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు.. తీరిన అవస్థలు

స్పందనకు వందనం

మహాలక్ష్మి ఎస్టీ కాలనీ (చినగంజాం), న్యూస్‌టుడే: చినగంజాం మహాలక్ష్మి ఎస్టీకాలనీలోని తూర్పు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రులు రోడ్డుపై పాములు తిరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సమస్యను ఆగస్టు 29న 'మేమున్నాం... మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. స్పందించిన పంచాయతీ గ్రామ కార్యదర్శి దాసరి సుధీర్‌కుమార్ పంచాయతీ ఒప్పంద విద్యుత్తు కార్మికుడు ఏసోబును పంపించి మరమ్మతులు చేయించారు.

ప్రభుదేవా కాలనీ (చినగంజాం), న్యూస్‌టుడే: చినగంజాం పంచాయతీ పరిధి ప్రభుదేవా కాలనీ వీధి దీపాలు వెలగడం లేదు. సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ఆగస్టు 30న 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. పంచాయతీ గ్రామ కార్యదర్శి సుధీర్‌కుమార్ పంచాయతీ ఒప్పంద కార్మికుడితో మరమ్మతులు చేయించారు.

పూలవారిపాలెం (చినగంజాం), న్యూస్‌టుడే: పూలవారిపాలెం 216-జాతీయ రహదారికి వెళ్లే రోడ్డుపై వీధి దీపాలు వెలగడం లేదు. పాములతో రాత్రులు ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలిపారు. ఆగస్టు 31 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి రావడంతో పంచాయతీ గ్రామ కార్యదర్శి దాసరి సుధీర్‌కుమార్ పంచాయతీ కార్మికుడిని పంపి వీధి దీపాలను బాగు చేయించారు.

ఖాళీ స్థలాలు.. సర్పాలకు ఆవాసాలు

భయాందోళనలో స్థానికులు

కొత్తపేట (వేటపాలెం), న్యూస్‌టుడే: 'పట్టణంతో పోటీపడుతున్న పంచాయతీ.. దీంతో ఇక్కడ నివాసాల సంఖ్య క్రమేపి పెరుగుతున్నాయి'. ఉద్యోగులు, వ్యాపారులు ఇక్కడ ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇదే సమయంలో కొందరు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని స్థలాలు కొనుగోలు చేసి వాటిని అలాగే వదిలేస్తున్నారు. దీంతో వాటిల్లో చిల్ల చెట్లు పెరిగి సర్పాలకు నిలయంగా మారడంతో సమీపంలో ఉండేవారు వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం.

కొత్తపేటలోని ఖాళీ స్థలంలో ముళ్లచెట్లు

పంచాయతీకి ఆదాయం..

చీరాలకు కూతవేటు దూరంలో ఉన్న కొత్తపేట దినదినాభివృద్ధి చెందుతోంది. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బహుళ అంతస్తులు పక్కనే ఉన్న పట్టణంతో పోటీ పడుతున్నాయి. దీంతో పాటు ఇటీవల వ్యక్తిగతంగా గృహాలు నిర్మించి విక్రయించే పనిలో బిల్డర్లు ఉన్నారు. ఫలితంగా వివిధ వర్గాలు ఈ ప్రాంతంలో నివసించేందుకు ముందుకొస్తున్నారు. ఇదే సమయంలో పంచాయతీ ఆదాయం సైతం పెరుగుతోంది.

ముందు చూపుతో స్థలాల కొనుగోలు..

ఈ ప్రాంత అభివృద్ధిని ముందుగానే ఊహించిన పలువురు స్థలాలు కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీ గోడలు, కంచెలు వేసి అలాగే వదిలేశారు. ఫలితంగా వీటిల్లో చిల్లచెట్లు దట్టంగా పెరగడంతో చుట్టుపక్కల వారికి ఇబ్బందిగా మారింది. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే చాలు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చొరవ చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గుర్తించి పరిష్కరిస్తాం

సిబ్బందిని పంపి ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో ముందుగా గుర్తిస్తాం. ఆ తరువాత యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. పురపాలక సంఘాల్లో అయితే ఖాళీ స్థలాలకు పన్ను వేయడానికి అవకాశం ఉంది. పంచాయతీల్లో ఆ పరిస్థితి లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.
– సురేంద్ర, ఇన్‌ఛార్జీ పంచాయతీ కార్యదర్శి, కొత్తపేట

దాతల చేయూత గ్రామీణ విద్యార్థులకు చేరువైన కంప్యూటర్ విజ్ఞానం

పూర్వ విద్యార్థులు అందించిన కంప్యూటర్‌తో ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విజ్ఞానం చేరువైంది. గ్రామానికి చెందిన పలువురు పూర్వ విద్యార్థులు, కొడాలి కార్తీక్ రూ.50 వేల విలువైన కంప్యూటర్ మానిటర్, సీపీయూ వంటి పరిజ్ఞాన సామగ్రిని సోమవారం బహుకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు విద్యాంజలి 2.0 పోర్టల్ ద్వారా దాతకు ధ్రువపత్రం అందించారు. కంప్యూటర్ ద్వారా గ్రామీణ బాలలు మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశం దక్కిందని హెచ్‌ఎం అన్నారు. ఉదారత చాటుకున్న పూర్వ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.

చేనేత సహకార సంఘాల బకాయిలు విడుదల చేయాలి

సమావేశానికి హాజరైన కార్యాచరణ కమిటీ ప్రతినిధులు

ఈపూరుపాలెం (చీరాల అర్బన్), న్యూస్‌టుడే: చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.203 కోట్లను వెంటనే విడుదల చేయాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం ఈపూరుపాలెంలోని కుర్రి కోటయ్య, ప్రగడ కోటయ్య స్మారక భవనంలో దామర్ల శ్రీకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, నేత వస్త్రాలపై ఉన్న 5శాతం జీఎస్టీని ఎత్తేయాలన్నారు. నేతన్న సేవలో పథకాన్ని అర్హులకు అందించాలన్నారు. 11 రకాల చేనేత రిజర్వేషన్ల చట్టాన్ని అమలు, తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ నెల 2న మంగళగిరిలో జరిగే రాష్ట్రస్థాయి చేనేత సంఘాల సమావేశానికి సంఘాల అధ్యక్షులు, చేనేత వ్యాపారులు, నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

వాగులో వ్యర్థాలు.. వరద వస్తే ఇబ్బందులు

ఇంకొల్లు సమీపంలోని అప్పేరు వాగు ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడిన కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాగు పలుచోట్ల ఆక్రమణలకు గురికావటం, వాగు మధ్య అడవి తుమ్మచెట్లు పెరిగిపోయిన కారణంగా వరదనీరు దిగువకు వెళ్లే ఒరవడి తగ్గి పొలాల్లోకి, సమీప కాలనీల్లోకి ప్రవహిస్తోంది. చింతపాలెం రహదారిలోని అడ్డీపతి దగ్గర నుంచి ముప్పవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు, ఆఫీసర్స్ క్లబ్ నుంచి కడవకుదురు రోడ్డు ఒకటో మైలు వరకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కొందరు రైతులు వాగును ఆక్రమించుకుని కట్టలు వేశారు. ఆ ప్రాంతంలో వాగు ఇరుకై నీరు దిగువకు వెళ్లడం లేదు. వాగు లోపల ఏపుగా పెరిగిన తుమ్మచెట్లకు ప్లాస్టిక్ సంచులు ఇతర వ్యర్థాలు చుట్టుకుపోయి నీటి ప్రవాహ వేగం తగ్గిపోయి పైర్లు ముంపునకు గురవుతున్నాయి. వాగు సర్వే నిర్వహించి ఆక్రమణలు, చిల్లచెట్లు తొలగించాలని రైతులు, వాగు పరిసరాల కాలనీవాసులు కోరుతున్నారు. **- ఇంకొల్లు, న్యూస్‌టుడే**

చెరువులకు చేరుతున్న సాగర్ జలాలు



రాజుపాలెం మేజర్ నుంచి మార్టూరు తాగునీటి చెరువులకు చేరుతున్న సాగర్ జలాలు

మార్టూరు, పర్చూరు, న్యూస్‌టుడే: ప్రజల తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన సాగర్ జలాలు చెరువులకు చేరుతున్నాయి. ఇటీవల ఎన్నెస్పీ ఉన్నతాధికారులు సాగర్ కుడి కాలువకు తాగునీటి కోసం ఎనిమిది టీఎంసీల జలాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో సోమవారం మండలంలోని వలపర్ల సమీపంలోని రాంకూర్ హెడ్ రెగ్యులేటర్‌కి 854 క్యూసెక్కుల ప్రవాహం చేరుకుంది. వీటిని నియోజకవర్గంలోని మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, ఇంకొల్లు మండలాల్లోని 64 నోటిఫైడ్ చెరువులకు సాగర్ జలాలను మళ్లించేలా ఎన్నెస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారుల పర్యవేక్షణ చేపట్టారు. ఇందులో భాగంగా ద్రోణాదుల మేజర్‌కు 150, కోటపాడు మేజర్‌కు 200, నూతలపాడు మైనర్‌కు 200, పమిడిపాడు మేజరుకు 240, రాజుపాలెం మేజరు 20 క్యూసెక్కుల జలాలును పంపిణీ చేస్తున్నారు. మండలాల్లోని తాగు నీటి చెరువులు నింపుకునేలా వ్యవహరిస్తున్నట్లు ఆయా శాఖ అధికారులు వెల్లడించారు. 25వేల మంది జనాభా ఉన్న మార్టూరు చెరువు నింపేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు ప్రత్యేక అధికారి రావెళ్ల శ్రీనివాస్ వెల్లడించారు.

ఆభరణాల చోరీపై కేసు నమోదు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన లక్ష్మీ భర్తతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల ఆమె తల్లికి ఆరోగ్యం బాగోలేదు. దీంతో నూతలపాడు వచ్చి తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు ఆగస్టు 30న పర్చూరులో నరసరావుపేట బస్సు ఎక్కారు. నరసరావుపేట బస్టాండ్‌లో దిగారు. సత్తెనపల్లిలో రైలు ఎక్కేందుకు మరో బస్సు ఎక్కి బ్యాగ్ పరిశీలించగా అందులో 12 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆమె ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై వంశీకృష్ణ తన బృందంతో బస్టాండ్‌లో సీసీ ఫుటేజ్‌లు పరిశీలించారు. బస్సును ఫుట్‌పాత్ దగ్గర కాకుండా ఆవరణలో ఆపడం, పైగా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఫుటేజ్ క్షుణ్ణంగా కనిపించలేదని, దీనిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుని బాధితురాలికి న్యాయం చేస్తామన్నారు.

మూడు రోజులుగా అందని నీరు

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: పేరలిలో మూడు రోజుల నుంచి కుళాయిల ద్వారా తాగునీరు ప్రజలకు అందడంలేదు. దీంతో గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా నెలలో 3 నుంచి నాలుగుసార్లు రెండు, మూడు రోజులకొకసారి చొప్పున అందడంలేదు. క్రమం తప్పకుండా రోజు నీరందించాలని ప్రజలు కోరుతున్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

గంగాధరరావు దంపతులను సన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

వేటపాలెం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన వారికి ఎల్లప్పుడూ సమాజంలో గుర్తింపు ఉంటోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. బండ్ల బాపయ్య జూనియర్ కళాశాల ప్రధానాచార్యుడుగా పనిచేసి పదవీ విరమణ చేసిన ములకల గంగాధరరావు అభినందన సభ సోమవారం నిర్వహించారు. అధ్యాపకుడిగా 33ఏళ్లలో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చల్లా వాసుదేవరావు, గొల్లపూడి సీతారాం, రోటరీ పాస్ట్ ప్రెసిడెంట్ కొత్త శ్రీనివాసరావు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, స్నేహితులు పాల్గొన్నారు.

పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి

బాపట్ల, న్యూస్‌టుడే: గత తెదేపా ప్రభుత్వ హయాంలో తనకు మంజూరు చేసిన పింఛన్‌ను 2022లో వైకాపా ప్రభుత్వం తొలగించిందని చీరాల మండలం పిట్టువారిపాలేనికి చెందిన అంధుడు ఊసా వీరాంజనేయులు సోమవారం బాపట్లలో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి వాసుబాబు గతంలో పురపాలక సంఘంలో ఒప్పంద కార్మికుడిగా పనిచేశారని కారణం చూపుతూ పింఛను తొలగించడంతో బతుకు భారంగా మారిందన్నారు. ప్రస్తుతం తన తండ్రి ఒప్పంద కార్మికుడిగా పనిచేయటం లేదన్నారు. తన పింఛన్‌ను పునరుద్ధరించి న్యాయం చేయాలని పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

క్రీడా మైదానాల్లో మౌలిక సదుపాయాలకు..

మాట్లాడుతున్న బీజేవైఎం నేతలు అర్జున, మణికుమార్, భార్గవ్‌రెడ్డి

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని క్రీడా మైదానాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులు ఆటలు ఆడేలా ప్రోత్సహించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కృష్టార్జున కోరారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌ను బీజేవైఎం నేతలు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడా మైదానాలు ఉన్న ప్రైవేటు పాఠశాలలకే అనుమతులు ఇవ్వాలన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను పాఠశాల దశ నుంచే గుర్తించి, సౌకర్యాలు కల్పించి, తగిన శిక్షణతో ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతారని అన్నారు. నేతలు మణికుమార్, భార్గవ్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది

ఇది బాపట్ల జిల్లా చీరాల టౌన్ వేటపాలెం మండలం కొత్తపేట RTC కాలనీ డోర్ నెం: 8-68 నందు నివాసం ఉంటున్న నేను గొర్రె శ్రీనివాసులు కుమారుడు G.వెంకట నందకుమార్ అందరికీ తెలియజేయు బహిరంగ ప్రకటన. గత 2022-2026 విద్యా సంవత్సరంలో కలసలింగం విశ్వవిద్యాలయంలో బిటెక్ (CSE - AIML) చదివి ఉత్తీర్ణత సాధించినందుకు గాను నాకు మే 2026 ఒరిజినల్ డిగ్రీ (కాన్వోకేషన్) సర్టిఫికెట్ జారి చేయబడింది. నేను దానిని జిరాక్స్ కాఫీ తీయించుకోవడానికి 02-08-2026 సాయంత్రం 4.00 గంటలకు వెళ్లి నా ఒరిజినల్ డిగ్రీ (కాన్వోకేషన్) సర్టిఫికెట్‌ను పోగొట్టుకున్నాను. ఒకవేళ అది ఎవరికైనా కనపడిన యెడల లేదా దొరికిన యెడల దానిని పైన పేర్కొన్న నా చిరునామాకు అప్పగించాలని తెలియజేయడమైనది.

G.వెంకట నందకుమార్
చీరాల. 8074327365

(c) eenadu